Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 318 మేడ్చల్ మల్కాజ్‌గిరి 7 డిసెంబర్ 2023 గురువారం పేజీలు : 4

## బంగారం ధర మళ్లీ పెరిగింది

నిన్న స్థిరంగా ఉన్న బంగారం ధర నేడు మళ్లీ పెరిగింది. దేశంలో బంగారం ధరలు పెరిగాయి. 10 గ్రాముల బంగారం ధరపై రూ.440 వరకూ పెరిగింది. ఇక వెండి ధరలు మాత్రం స్వల్పం(400 వరకూ)గా తగ్గాయి. 22 క్యారెట్ల బంగారం ధర(10 గ్రాములు) 47,750 కాగా.. 24 క్యారెట్ల బంగారం ధర(10 గ్రాములు) 52,090గా ఉంది. ఇక దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరల్లో హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి.

**బంగారం ధరలు..** హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర(10 గ్రాములు) రూ.47,750.. 24 క్యారెట్ల బంగారం ధర(10 గ్రాములు) రూ.52,090విజయవాడలో 22క్యారెట్ల బంగారం ధర(10 గ్రాములు) రూ.47,750.. 24 క్యారెట్ల బంగారం ధర(10 గ్రాములు) రూ.52,090

# రేవంతుడి పట్టాభిషేకానికి ఏర్పాట్లు పూర్తి

## కార్యక్రమానికి హాజరు కానున్న హేమాహేమీలు



## ప్రమాణ స్వీకార సమయంలో స్వల్ప మార్పు మధ్యాహ్నం 1.04 గం.లకు

హైదరాబాద్ : తెలంగాణ నూతన సీఎం ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ క్రమంలో హైదరాబాద్ లోని ఎల్బీ స్టేడియంలో ఈ కార్యక్రమం అత్యంత వైభవంగా జరగబోతుంది. ఈ నేపథ్యంలో అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, ఇతర శాఖల ఉన్నతాధికారులు పరిశీలించారు. ఈ సమయంలో రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకార సమయంలో మార్పు జరిగింది. అవును... తెలంగాణకు కాబోయే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకార సమయంలో మార్పు జరిగింది. ముందుగా గురువారం ఉదయం 10:28 గంటలకు ఆయన ప్రమాణ స్వీకారం చేయాలని నిర్ణయించగా.. తాజాగా ఆ సమయాన్ని కాస్త మార్చారు. ఇందులో భాగంగా గురువారం మధ్యాహ్నం 1:04 గంటలకు రేవంత్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ వర్గాలు ఈ మారిన సమయాన్ని వెల్లడించాయి. మరోవైపు రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. ఈ సమయంలో... తన ప్రమాణ స్వీకారానికి రావాల్సిందిగా కాంగ్రెస్ అగ్రనేతలను ఆయన ఆహ్వానిస్తున్నారని తెలుస్తుంది. ఈ క్రమంలో ఇప్పటికే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తో సమావేశమైన రేవంత్.. ఆ తర్వాత అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ ను కలిశారు. ఇలా తన ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆహ్వానించిన అనంతరం కేబినెట్ కూర్పు, ఇతర అంశాలపై వారితో చర్చించినట్లు తెలుస్తుంది. ఈ సమయంలో సోనియా, రాహుల్ గాంధీతో రేవంత్ రెడ్డి సుమారు 50 నిమిషాల పాటు వివిధ అంశాలపై చర్చించారని తెలుస్తుంది! ఇదే సమయంలో రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహణ, ఏర్పాట్లపై ఎల్బీ స్టేడియంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలతో.. పోలీసు, సాధారణ పరిపాలన శాఖ అధికారులు చర్చించారు.

**55 ఏళ్లకు రేవంత్ సీఎం.. మిగతావారు ఏ వయసులో..** మండల స్థాయి పదవి అయిన జడ్పీటీసీ సభ్యుడి నుంచి 17 ఏళ్లలో రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి ఎదగడం అంటే.. మాటలు కాదు. కాలం కలిసిరావాలి.. నాయకత్వ పటిమ ఉండాలి.. రాజకీయాల్లో పట్టువిడుపులు ఉండాలి.. సొంత పార్టీ ప్రత్యర్థులను ఎదుర్కొనాలి.. ఎదుటి పార్టీ శత్రువులను మట్టికరిపించాలి.. ఇదంతా ఉంటూనే, అధిష్ఠానం స్థాయిలో మంచి మార్కులు పడాలి.. ఇవన్నీ సాధించారు ఎనుముల రేవంత్ రెడ్డి. తెలంగాణకు కాంగ్రెస్ తరఫున తొలి సీఎంగా చరిత్రలో నిలవనున్నారు.

**అంచలంచెలుగా అనూహ్యంగా....** రేవంత్ 1968 నవంబరులో జన్మించారు. ప్రస్తుతం ఆయన వయసు 55. ఈ లెక్కన ఆయనకు మరో 20 ఏళ్ల వరకు గొప్ప భవిష్యత్ ఉందనడంలో సందేహం లేదు. వాస్తవానికి 20 ఏళ్ల కిందట రాజకీయ ప్రస్థానం మొదలైనప్పుడు ఇంత తొందరగా సీఎం అవుతానని రేవంత్ ఊహించి ఉండరు. కానీ, అలా జరిగిపోయింది. మిడ్జిల్ జడ్పీటీసీగా అన్ని పార్టీల మద్దతుతో గెలవడం ఓ అద్భుతమైతే.. వంద ఓట్లు తక్కువగా ఉన్నప్పటికీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలవడం పెను సంచలనం. ఆపై ఏడాదికే ఎమ్మెల్యేగా శాసన సభలో అడుగుపెట్టడం మరో చరిత్ర. ఇప్పుడు సీఎం కావడం చరిత్రను తిరగరాయడమే.

**గొప్ప భవిష్యత్...** రేవంత్ 55 ఏళ్లకే సీఎం అవుతున్నారు. అంటే.. రాష్ట్రస్థాయిలో ఇప్పటికే ఆయన అత్యున్నత పదవిని అలంకరించారు. కనీసం మరో 20 ఏళ్లు రాజకీయాల్లో ఉంటారు.

అంటే సుదీర్ఘ రాజకీయ భవిష్యత్ ఆయన సొంతం. ఈ ఐదేళ్ల కాలంలో సీఎంగా ఎలాంటి మార్పులు తెస్తారనేదానిపైనే రేవంత్ భవిష్యత్ ఆధారపడి ఉంటుంది. చైతన్యవంతమైన తెలంగాణ సమాజాన్ని రేవంత్ ఎలా సమాధానపరుస్తారో చూడాలి.

**చంద్రబాబు, కేసీఆర్ సరసన..** దాదాపు 45 ఏళ్ల వయసులో ఉమ్మడి ఏపీ సీఎం అయ్యారు చంద్రబాబు నాయుడు. అంత తక్కువ వయసులో ఇప్పటివరకు ఎవరూ ముఖ్యమంత్రి కాలేదు. ఇక కిరణ్ కుమార్ రెడ్డి ఉమ్మడి ఏపీ చివరి సీఎం. ఆయన 2010లో ఉమ్మడి ఏపీలో సీఎం అయ్యారు.

అప్పటికి ఆయనకు 51 ఏళ్లు. తెలంగాణ ఏర్పాటయ్యాక కేసీఆర్ దాదాపు 59 ఏళ్ల వయసులో ముఖ్యమంత్రి అయ్యారు. ఉమ్మడి ఏపీలో వైఎస్.. 55 ఏళ్లకు సీఎం అయ్యారు. చంద్రబాబు రికార్డును వైఎస్ జగన్ 2014లో ఛేదిస్తారని అనిపించింది. అప్పటికి ఆయన వయసు 43 ఏళ్లే. కానీ, ఎన్నికల్లో ఓటమితో జగన్ కోరిక నెరవేరలేదు. కాగా, ఎన్టీఆర్ 60 ఏళ్లు దాటాక సీఎం అయ్యారు. ఈ లెక్కన రేవంత్ కు కాస్త ముందుగానే గొప్ప పదవి దక్కింది. మరి దీనిని ఆయన ఎలా సద్వినియోగం చేసుకుంటారో చూడాలి.



## ప్రమాణస్వీకారానికి రావాలంటూ తెలంగాణ ప్రజలకు రేవంత్ రెడ్డి బహిరంగ లేఖ

హైదరాబాద్: తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడి బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్‌లో ఎల్బీ స్టేడియంలో జరగనున్న తన ప్రమాణస్వీకారానికి ప్రజలంతా రావాలని బహిరంగ లేఖలో రేవంత్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజలకు రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. విద్యార్థుల పోరాటం, అమరుల త్యాగం, సోనియాగాంధీ ఉక్కు సంకల్పంతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో మనందరి ఆకాంక్షలు నేరవేర్చే ఇందిమ్మ రాజ్య స్థాపనకు సమయం ఆసన్నమైనదని రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య, పారదర్శక పాలన అందించేందుకు బలహీన వర్గాలు, దళిత, గిరిజన, మైనారిటీ, రైతు, మహిళ, యువత్ సంక్షేమ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు మీ అందరి ఆశీస్సులతో 2023 డిసెంబర్ 7న, మధ్యాహ్నం 1.04 గంటలకు హైదరాబాద్ ఎల్బీ సేడియంలో ప్రజా ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేయబోతోందని రేవంత్ తెలిపారు. ఈ మహోత్సవానికి అందరికీ ఇదే ఆహ్వానం అంటూ రేవంత్ లేఖ రాశారు.

## రేవంత్ ప్రమాణ స్వీకారానికి సోనియా, చంద్రబాబు, కేసీఆర్ - జగన్ కు ఆహ్వానం..!!



హైదరాబాద్ : తెలంగాణ నూతన ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇందుకు వేదిక..ముహూర్తం ఇప్పటికే ఖరారైంది. ఈ ప్రమాణ స్వీకారానికి హాజరు కావాల్సింది సోనియా,రాహుల్, ప్రియాంక, ఖర్గే లను రేవంత్ స్వయంగా ఆహ్వానించారు. సోనియా గాంధీ, రాహుల్ హైదరాబాద్ లో జరిగే రేవంత్ ప్రమాణ స్వీకారానికి వస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో కేసీఆర్, చంద్రబాబు, జగన్, పవన్ కల్యాణ్ లను ఆహ్వానిస్తుండటంతో వారిలో ఎవరు హాజరవుతారనేది ఆసక్తిగా మారుతోంది. రేవంత్ ప్రమాణ స్వీకారం రేవంత్ ప్రమాణ స్వీకారానికి కాంగ్రెస్ అగ్రనాయకత్వం తరలి వస్తుంది. ఇక..కేసీఆర్ తన పాలన ఎలా ఉంటుందనేది గెలిచిన తరువాత జరిగిన మీడియా సమావేశంలో స్పష్టం చేసారు. కేసీఆర్ తో సహా అందరినీ కలుపుకుపోతామని స్పష్టం చేసారు. రేవంత్ రాజకీయ జీవితం ఆరంభంలో బీఆర్ఎస్ లో పని చేసారు. కేసీఆర్ ఓటమి లక్ష్యంగా పని చేసిన రేవంత్..ఇప్పుడు స్వయంగా కేసీఆర్ ను ప్రమాణ స్వీకారానికి ఆహ్వానిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే, కేసీఆర్ హాజరవుతారా లేక కేటీఆర్ వస్తారా అనేది స్పష్టం కావాల్సి ఉంది. అదే విధంగా టీడీపీ అధినేత చంద్రబాబు..ఏపీ సీఎం జగన్... పవన్ కల్యాన్ ను రేవంత్ వ్యక్తిగతంగా ఆహ్వానించాలని నిర్ణయించారు. చంద్రబాబు – జగన్ కు ఆహ్వానం చంద్రబాబు రేపు రేవంత్ ప్రమాణ స్వీకారానికి హాజరు కావటం పైన ఇంకా క్లారిటీ రాలేదు. రేపు చంద్రబాబు ఢిల్లీ వెళ్లనున్నారు. అయితే, టీడీపీలో రెండు సార్లు ఎమ్మెల్యేలగా..చంద్రబాబు విధేయుడిగా గతంలో పని చేసిన రేవంత్ ఇప్పుడు సీఎంగా ప్రమాణ స్వీకారం చేస్తుండటంతో చంద్రబాబు హాజరయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఓటు కు నోటు కేసులో రేవంత్ జైలుకు వెళ్లిన సమయంలో కుమార్తె నిశ్చితార్థంకు చంద్రబాబు – భువనేశ్వరి హాజరు అయ్యారు. దగ్గర ఉండి పెద్దరికంగా కార్యక్రమం నిర్వహించారు. అయితే, ఇప్పుడు పార్టీలు వేరైనా..వ్యక్తిగత సంబంధాలతో హాజరయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇక, పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్ ను రేవంత్ ఆహ్వానించనున్నారు. కానీ, ఏపీలో తుఫాను పరిస్థితుల కారణంగా ఏపీ నుంచి మంత్రి బుగ్గన హాజరయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రముఖల హాజరుపై ఆసక్తి జనసేన నుంచి పవన్ కళ్యాణ్ వస్తారా రారా అనేది క్లారిటీ లేదు. జనసేన ప్రతినిధిగా నాదెండ్ల మనోహర్ హాజరయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. గతంలో మనోహర్ స్పీకర్ గా పని చేసిన సమయంలో రేవంత్ ఎమ్మెల్యేగా ఉన్నారు. అయితే, పార్టీలకు అతీతంగా అందరినీ ఆహ్వానించాలని రేవంత్ నిర్ణయించారు. దీంతో..రేవంత్ ప్రమాణ స్వీకారానికి కేసీఆర్, చంద్రబాబు, జగన్, పవన్ హాజరు పైన ఆసక్తి కనిపిస్తోంది. అదే విధంగా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య సైతం రానున్నట్లు సమాచారం. ప్రమాణ స్వీకార వేదిక నుంచే అందరి సమక్షంలో రేవంత్ కాంగ్రెస్ హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల పైన తొలి సంతకం చేయనున్నారు.

## వైఎస్ ఫార్ములాతో రేవంత్

# ఇదే సక్సెస్ మంత్ర..!!



హైదరాబాద్ : రేవంత్ రెడ్డి. కాబోయే తెలంగాణ ముఖ్యమంత్రి. పార్టీలో చేరిన అనతి కాలంలోనే సీనియర్లను కాదని సీఎం పదవి దక్కించుకున్నారు. కాంగ్రెస్ లో చేరిన సమయం నుంచి రేవంత్ ప్రతీ అడుగు వ్యూహాత్మకంగా వేసారు. పార్టీ హైకమాండ్ ను మెప్పించేందుకు తొలి నుంచి ప్రయత్నించారు. ఇందుకు పూర్తిగా వైఎస్సార్ అమలు చేసిన ఫార్ములానే రేవంత్ కొనసాగించారు. “అన్నింటా” హైకమాండ్ కు అభయం ఇచ్చారు. అదే సక్సెస్ మంత్రగా మార్చుకున్నారు. రేవంత్ వ్యూహాత్మకం : వైఎస్సార్ తరువాత ఇప్పుడు కాంగ్రెస్ కు ఆదరణ ఉన్న నేత రేవంత్ కనిపిస్తున్నారు. తెలంగాణ ఇచ్చినా రెండు రాష్ట్రాల్లోనూ నష్టపోయిన కాంగ్రెస్ పదేళ్ల తరువాత అధికారం దక్కించుకుంది. కాంగ్రెస్ లో చేరిన సమయం నుంచే ఢిల్లీ కేంద్రంగా సైలెంట్ ఆపరేషన్ అమలు చేసారు. అదే సీనియర్లు పోటీ పడ్డా..ఎందరు అడ్డు చెప్పినా టీపీసీసీ పదవి దక్కటానికి కారణం అయింది. ఆ పదవి ఇస్తే పార్టీని అధికారంలోకి తీసుకొచ్చే బాధ్యత తనదేనని రేవంత్ స్పష్టం చేసారు. కాంగ్రెస్ కు మింగుడపడని కేసీఆర్ ను టార్గెట్ చేస్తూ..హైకమాండ్ ను ఆకట్టుకున్నారు. ఉప ఎన్నికల్లో ఓడినా.. సీనియర్లు ఫిర్యాదులు చేసినా హైకమాండ్ ను ఎలా మేనేజ్ చేయాలో నాడు వైఎస్సార్ అమలు చేసిన ఫార్ములానే కొనసాగించారు. హైకమాండ్ తన మాట విశ్వసించేలా చేయటంలో సక్సెస్ అయ్యారు.

**హైకమాండ్ ను మెప్పిస్తూ :** 2009 ఎన్నికల సమయంలోనూ నాడు వైఎస్సార్ ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుపు బాధ్యత తనదేని పార్టీ హైకమాండ్ కు అభయం ఇచ్చారు.

పొత్తుల విషయంలో ససేమిరా అన్నా వైఎస్సార్ తాను సూచించిన వాళ్లకు సీట్లు ఇవ్వాలని కోరారు. వైఎస్సార్ మాట పైన సోనియా నమ్మకం పెట్టుకున్నారు. ఆ ఎన్నికల్లో మహా కూటమి, ప్రజారాజ్యంతో తలపడిన వైఎస్సార్ కాంగ్రెస్ ను తిరిగి అధికారంలోకి తెచ్చారు. అదే సమయంలో కేంద్రంలో రెండో సారి యూపీఏ ప్రభుత్వం ఏర్పాటుకు కీలకమైన 34 సీట్లను గెలిపించారు.

అప్పటికే ప్రజాదర్బార్, పేదలకు దగ్గరయ్యే పథకాల అమలుతో హైకమాండ్ మెప్పు పొందారు. అదే సమయంలో పార్టీలో

## హైకమాండ్ వద్ద రేవంత్ రేంజే వేరప్పా

వ్యతిరేకించే నేతల సంబంధీకులకు కేబినెట్ లో అవకాశం కల్పించి వారిని సైతం కంట్రోల్ చేసారు. వైఎస్సార్ తరహాలో: ఇప్పుడు రేవంత్ అచ్చం వైఎస్ తరహాలోనే ముందుకు వెళ్తున్నారు. తాజా ఎన్నికల్లో పార్టీని గెలిపించే బాధ్యద తనదేనని నమ్మించారు. అభ్యర్దులను పార్టీ ఖరారు చేసినా..తెర వెనుక వారిని ఎంపిక చేసింది రేవంత్. ఇక..ఇప్పుడు గ్యారంటీ పథకాల అమలు పైన హామీ ఇచ్చారు. త్వరలో జరగబోయే లోక్ సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ కు మెజార్టీ సీట్లు తెప్పించే బాధ్యత తదనేని రేవంత్ పార్టీ హైకమాండ్ కు హామీ ఇచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలవటంతో పార్లమెంట్ సీట్లు కీలకంగా భావించే కాంగ్రెస్ హైకమాండ్ మరో ఆలోచన లేకుండా రేవంత్ కు సీఎం పదవి కట్టబెట్టింది. ఇప్పుడు...పాలనా విషయంలో రేవంత్ ఏ విధంగా సక్సెస్ అవుతారనేది ఆసక్తి కరంగా మారుతోంది.

# సంపాదకీయం

## లోక్ సభ ఎన్నికలు ముందుకు బీజేపీ సక్సెస్ మూడ్

మూడు రాష్ట్రాలను గెలుచుకుని బీజేపీ మంచి సక్సెస్ మూడ్ లో ఉంది. ఆ అద్భుతమైన విజయాన్ని ఎంజాయ్ చేస్తోంది. ఉత్తరాదిన తమకు ఏ మాత్రం తిరుగులేదని రుజువు చేసుకుంది. ఈ మూడింటిలో రెండు పెద్ద రాష్ట్రాలు. రాజస్థాన్, మధ్యప్రదేశ్ లలో కలుపుకుని యాభైకి పైగా ఎంపీ సీట్లు ఉన్నాయి. అలాగే చత్తీస్ ఘడ్ లో సీట్లు కలుపుకుంటే మంచి నంబర్ ఉన్న స్టేట్స్ ఇపుడు బీజేపీ చేతిలో ఉన్నాయి. కాంగ్రెస్ కి 17 ఎంపీ సీట్లు ఉన్న తెలంగాణా ఉంది. ఇక ఓవరాల్ గా చూసుకుంటే తాజా సక్సెస్ తో దేశంలో 28 రాష్ట్రాలలో పన్నెండు రాష్ట్రాలు బీజేపీ ఖాతాలో ఉంటే తెలంగాణా కర్నాటక, హిమాచల్ ప్రదేశ్ లలో మాత్రమే కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఇవన్నీ కలిపినా యాభై ఎంపీ సీట్లు ఉండవు. దాంతో పాటు నార్త్ లో యూపీ వంటి పెద్ద స్టేట్ కూడా బీజేపీ చేతిలో ఉంది. మహారాష్ట్రలో అధికారం ఉంది. ఈ నేపథ్యంలో లోక్ సభ ఎన్నికల్లో చాలా ఆశలు బీజేపీకి కనిపిస్తున్నాయి. హ్యాట్రిక్ విజయం సాధ్యమని బీజేపీ నమ్ముతోంది. ఈసారి మా నంబర్ నాలుగు వందల ఎంపీ సీట్లు అని అంటోంది. అంత రాకపోయినా మెజారిటీ సీట్లు వస్తాయని నమ్ముతోంది. దాంతో ఈ వేడి వాడి గట్టిగా ఉండగానే లోక్ సభకు కొద్ది నెలలు ముందుకు తెచ్చి ఎన్నికలు జరిపించాలని చూస్తోంది. వాస్తవంగా చూస్తే ఏప్రిల్ మే నెలలలో లోక్ సభకు ఏడు విడతలుగా ఎన్నికలు జరుగుతాయి. దాని రెండు నెలలు ముందుకు తేవడం అంటే జనవరి ఎండింగులో నోటిఫికేష్ ఇచ్చి ఫిబ్రవరి మాచిలో మొత్తం ఎన్నికల ప్రక్రియ ముగించేలా చూడాలని బీజేపీ సరికొత్త ఆలోచనలు చేస్తోంది అని అంటున్నారు. ఇక మే నెల అంటే చాలా సమస్యలు ఉంటాయి. ఎండలు కష్టాలు కన్నీళ్ళు ఇబ్బందులు అన్నీ కూడా ఒక్కసారిగా వస్తాయి. అలాగే లేట్ అవుతున్న కొద్దీ విపక్ష కూటమి గట్టిగా బలపడుతుంది అన్న భయాలూ సందేహాలూ ఉన్నాయి. దాంతో ఇపుడు పై చేయిగా బీజేపీ ఉంది కాబట్టి ఎన్నికలకు పోవడమే మంచిది అని ఆలోచిస్తున్నారని టాక్. ఇక ఇండియా కూటమిలో కూడా లుకలుకలు ఉన్నాయి. కాంగ్రెస్ పెద్దన్న తనాన్ని ఇతర పక్షాలు ప్రశ్నిస్తున్నాయి. సరిగ్గా ఈ తరుణంలో కాంగ్రెస్ పెద్ద రాష్ట్రాలు పోగొట్టుకుంది. దాంతో కాంగ్రెస్ ఇబ్బందులో ఉంది. ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్, ఆప్ అధినేత కేజ్రీవాల్, తృణమూల్ అధినేత మమతా బెనర్జీ, బీహార్ లో నితీష్ కుమార్ వంటి వారు గుర్రుగా ఉన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇండియా కూటమి ఒక త్రాటి మీదకు రాకుండా ఎన్నికలకు వెళ్తే సో బెటర్ అని బీజేపీ వ్యూహకర్తలు లెక్క వేస్తున్నారుట. మొత్తానికి అన్నీ అనుకూలిస్తే జనవరి నెలాఖరులో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే చాన్స్ ఉంది అని అంటున్నారు. అలా అనుకుంటే కనుక ప్రస్తుతం జరుగుతున్న శీతాకాల సమావేశాలే ఆఖరువి అని అంటున్నారు. ఢిల్లీ సర్కిల్స్ లో ప్రస్తుతం వినిపిస్తున్న హాట్ హాట్ మ్యాటర్ ఇదే అంటున్నారు.

## అంబేద్కర్ ఆశయాలు అభివృద్ధికి సోపానాలు... ఎంపీపీ ఎల్లో బాయి




శామీర్ పేట ( గరుడ వార్త) బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలు ప్రపంచానికి ఆదర్శమనీ షామీర్పేట్ మండల ఎంపీపీ ఎల్లో భాయ్ అన్నారు. బుధవారం అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని, ఉమ్మడి షామీర్పేట్ మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయనకు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. షామీర్పేట్ మండల కార్యాలయం ప్రాంగణ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి దళిత సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ... అంబేద్కర్ తనకోసం కాక సమాజ శ్రేయస్సు కోసం జీవించాడని కొనియాడారు. విద్యతో ప్రపంచంలో దేనినైనా సాధించగలమని ప్రపంచానికి చెప్పకనే చెప్పారని ఆమె అన్నారు.

ఈ కార్యక్రమంలో జడ్పిటిసి మహంకాళి అనితలాలయ్య, దళిత సంఘం నాయకులు తుంకి మల్లేష్, మాజీ జడ్పిటిసి బాలేష్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు మహమ్మద్ అఫ్జల్ ఖాన్, షామీర్పేట్ మండల రేషన్ దుకాణాల డీలర్ల కార్యవర్గ సభ్యుడు నాగరాజ్, అలియాబాద్ వార్డు సభ్యులు లింగం తదితరులు పాల్గొన్నారు.

## సమ సమాజ స్థాపనకు అంబేద్కర్ చేసిన కృషి అసామాన్యం...సర్పంచ్ గురక కుమార్



శామీర్ పేట ( గరుడ వార్త) : సమసమాజ స్థాపనకు అంబేద్కర్ చేసిన కృషి అసమాన్యమని అలియాబాద్ గ్రామ సర్పంచ్ గురక కుమార్ కొనియాడారు. బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని గ్రామ ప్రధాన కూడలిలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందంటే అందుకు అంబేద్కర్ దూరదృష్టే కారణమని గుర్తు చేశారు. సమాజంలో ఏ వ్యక్తి అయినా మహోన్నతుడిగా ఎదగాలంటే విద్యనే మూలమని అంబేద్కర్ ప్రపంచానికి చాటి చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, వార్డ్ సభ్యులు రాజు దొర, రాజేష్ లింగం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గాదె వెంకటేష్ తో పాటుగా బిఆర్ఎస్ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అభ్యంతరాలతో ఆగిన ఉపకేంద్రం నిర్మాణం



ఏటూరునాగారం : ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లిలో చేపట్టిన విద్యుత్తు ఉపకేంద్రం పనులను అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. అనుమతులు లేవని అభ్యంతరం తెలపడంతో పునాది పనులను అర్ధంతరంగా ఆపేశారు. బోరు కోసం తీసిన గుంతతో ప్రమాదం పొంచి ఉందని స్థానికులు చెప్పినా ససేమిరా అన్నారు. వాహనం సీజ్ చేస్తామంటూ బోరు సెట్టు యజమానిని హెచ్చరించారు. దీంతో కేసింగ్ పని పూర్తి చేయకుండానే నిలిపేసి వెనుదిరిగాడు. పిల్లర్ల ఏర్పాటు కోసం తవ్విన గుంతలతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల తరబడి ఎదురవుతున్న సమస్యలు దృష్టిలో ఉంచుకుని చిన్నబోయినపల్లిలో విద్యుత్తు ఉపకేంద్రం మంజూరు చేశారు. ఈ సబ్‌స్టేషన్‌తో పూర్తి అటవీ ప్రాంతంలోనే ఉన్న గ్రామాలకు త్రీ ఫేస్ విద్యుత్తు సరఫరా నిరంతరాయంగా అందించే అవకాశం ఉంటుంది. సుమారు 25 కిలో మీటర్ల పరిధిలో 15 గ్రామాల వరకు ఉన్నాయి. నిర్మాణం పూర్తైతే ఆయా గ్రామాలకు దీర్ఘకాలిక విద్యుత్తు సమస్య తీరేది.

కొలిక్కిరాని భూ వివాదం

సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేసిన భూమి వివాదం కొలిక్కి రావడం లేదు. అటవీ, రెవెన్యూ శాఖ మధ్య సంవత్సరాల తరబడి ఈ వివాదం కొనసాగుతూనే ఉంది. చిన్నబోయినపల్లి రెవెన్యూ శివారు 98 సర్వే నంబర్‌లో మొత్తం 828.18 ఎకరాల భూమి ఉంది. అందులో కొంత వరకు అడవి విస్తరించి ఉండగా సుమారు 250 ఎకరాల మేర అడవులు లేకుండా ఉండేవి. 35 సంవత్సరాలుగా ఈ భూముల్లో వంద మందికి పైగా రైతులు పోడు భూములని చెప్పి ఆరుతడి పంటలు సాగు చేసేవారు. దశాబ్దకాలంగా రైతులను సాగు చేయనీయకుండా ఆ భూమి అటవీశాఖదేనంటూ అధికారులు అడ్డుకుంటున్నారు. ఈ విషయంలో ధర్నాలు, నిరాహార దీక్షలు పెద్దఎత్తున కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా విద్యుత్తు ఉపకేంద్రం పనులను కూడా అడ్డుకున్నారు. పనులకు ఆటంకం కలిగించొద్దని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కలెక్టర్ చర్యలు తీసుకోవాలి: తుమ్మ సంజీవరెడ్డి, వైస్ ఎంపీపీ, చిన్నబోయినపల్లిసుదీర్ఘకాలంగా అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారమవుతు ందన్న తరుణంలో అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడం సరికాదు. విద్యుత్తు సబ్ స్టేషన్ పనులకు ఆడ్డు చెప్పొద్దు. ఈ విషయమై పునరాలోచించాలి. కలెక్టర్ మేరకు చర్యలు తీసుకోవాలి.

## పొట్టకూటికొచ్చి.. ప్రాణాలు విడుస్తూ..!

మిర్యాలగూడ : యాదగిరిగుట్ట మండలం వంగపల్లి పరిధిలో.. ఈ నెల 6న జాతీయ రహదారి విభాగిని మధ్య నీళ్లు పోసే ట్యాంకర్‌ను వెనక నుంచి లారీ ఢీకొట్టడంతో భార్య కళ్లెదుటే భువనగిరి మండలం కేసారానికి చెందిన కాశపాక ఎల్లేష్ నలిగిపోయి అక్కడికక్కడే మృతిచెందాడు. వారు రోజువారీ కూలీలు.. రెక్కాడితే కానీ డొక్కాడని జీవన పరిస్థితులు.. పొట్టకూటి కోసం వచ్చిన వారిని మృత్యువు రూపంలో దూసుకొస్తున్న వాహనాలు కబళిస్తున్నాయి. మొక్కలను బతికించేందుకు వచ్చి రోడ్డుపై బలవుతున్నారు. ప్రమాదాలు అనేకం జరుగుతున్నా.. పరిహారంతో సరిపెడుతున్నారు తప్ప నివారణకు ప్రత్యామ్నాయ మార్గాలు కనుగొనడం లేదు. ఇప్పటికే పది మంది వరకు హైదరాబాద్-భూపాలపట్నం జాతీయ రహదారి 163పై ప్రమాదాల బారిన పడ్డారు. కొందరు రహదారి సెంట్రల్ మీడియంలోని మొక్కలకు నీళ్లు పోస్తూ మృతిచెందారు. ఇదీ పరిస్థితి.. జాతీయ రహదారికి ఇరువైపులా, విభాగిని మధ్య మొక్కలు, చెట్ల సంరక్షణ చర్యల్లో భాగంగా కూలీలు నీళ్లు పడుతుంటారు. వాటిలో అప్పుడప్పుడు కలుపు తీస్తుంటారు. పనులు జరుగుతున్న సమయంలో కూలీలు రేడియం జాకెట్లు ధరించి ఉండాలి. రోడ్డుపై నిల్చున్న సమయంలో బారికేడ్లు ఏర్పాటు చేయాలి. స్టాపర్ కోన్‌లు ఏర్పాటు చేసి వాహనదారులు గుర్తించే చర్యలు చేపట్టాలి. ఇక్కడ పని చేస్తున్న కూలీలకు రక్షణ చర్యలు లేకపోవడంతో వాహనాలే వేగంగా దూసుకొచ్చి ఢీకొడుతున్నాయి. డ్రైవర్లు అప్రమత్తమై తప్పించాలనుకున్నా.. వాహన వేగాన్ని నియంత్రించలేక పోతున్నారు. నిబంధనలు పక్కాగా పాటిస్తూ పనులు చేయించాల్సిన సంబంధిత గుత్తేదారులు పట్టించుకోవడం లేదు. పర్యవేక్షించాల్సిన అధికారులు కనిపించడం లేదు. మొక్కలు నీళ్లు పట్టేందుకు బిందు సేద్యం పద్ధతి ఏర్పాటు చేసే అవకాశం ఉన్నా వినియోగించడం లేదు. జాతీయ రహదారి మరమ్మతులు, ఇతర పనులు చేపట్టేప్పుడు ఆ రోడ్డు గుండా వచ్చే వాహనదారులను అప్రమ త్తం చేసేవిధంగా చర్యలు తీసుకోవాలి. పక్కకు డైవర్షన్ ఇచ్చేలా 200 మీటర్ల దూరంలో ఎరుపు జెండా పట్టుకొని వాహనాలు నెమ్మదిగా వెళ్లేలా చూసేందుకు వ్యక్తిని నియమించాలి. జాతీయ రహదారిపైన వాహనం నిలిపి పనులు చేస్తున్న క్రమంలో ఆ దిశగా వచ్చే వాహనాదారులకు కనిపించేలా దూరంలోనే హెచ్చరిక, సూచన బోర్డు ఏర్పాట్లు ఉండాలి.

## రాజమార్గం.. సత్వర పరిష్కారం

మెదక్ : వివాదాలను రాజీమార్గంలో పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ చక్కటి వేదిక. సాధారణంగా కోర్టుల్లో అపరిష్కృత కేసుల పరిష్కారానికి దీన్ని నిర్వహిస్తున్నారు. ఇరువర్గాలకు అవగాహన కల్పించి వారి మధ్య రాజీ కుదిర్చడమే ఈ కార్యక్రమ లక్ష్యం. కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే ప్రధాన ఉద్దేశం. న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా సాధారణంగా కోర్టుల్లో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు ప్రీ లిటిగేషన్ సంబంధించినవి వాటికి ప్రాధాన్యం ఇస్తారు. ఇక్కడ తీర్పు ఇచ్చిన కేసులకు మళ్లీ అప్పీలు చేసుకునే అవకాశం లేదు.

ఇరువర్గాల విజయం

లోక్ అదాలత్‌లో రాజీమార్గంలో కేసులకు మోక్షం లభిస్తే ఇరువర్గాల విజయం సాధించినట్లే. ఇరు వర్గాలకు చెందిన వారు ఓ అవగాహనకు వస్తారు. కాబట్టే ఒకరిది గెలుపు, మరొకరిది ఓటమి అన్నట్లు ఉండదు. మానసికంగా కుంగిపోయే అవకాశం లేదు. అందుకే చాలా కాలం నుంచి న్యాయస్థానం చుట్టూ తిరుగుతున్న కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్ ఉత్తమమైన మార్గమని న్యాయమూర్తులు సూచిస్తున్నారు.

39,714 కేసుల పరిష్కారం



2022లో జిల్లా వ్యాప్తంగా నాలుగు సార్లు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఆయా కోర్టుల పరిధిలో 39,714 కేసులు పరిష్కరించారు. జిల్లాకేంద్రంలో ప్రత్యేకంగా న్యాయస్థానం ఏర్పాటైన తర్వాత 3 సార్లు కార్యక్రమం జరిగింది. జిల్లా కోర్టు ఏర్పాటు తర్వాత నిర్వహించిన తొలి లోక్ అదాలత్‌లో ఏకంగా ఎప్పుడూ లేనట్లుగా 13,829 కేసులకు మోక్షం దక్కింది. ఆ తర్వాత జరిగిన రెండింటింలో వరుసగా 13,987, 10,224 కేసులు పరిష్కరించారు. జిల్లా పరిధిలోని ఇరువర్గాల కక్షిదారులు ఆయా న్యాయస్థానాలకు వెళ్లి రాజీ కుదుర్చుకుంటున్నారు. కుటుంబ, ఆస్తి వివాదాలు, మోటారు రవాణా, బ్యాంకు రికవరీలు, ఎక్సైజ్, ముందస్తు విచారణ కేసులు, ప్రజా సంబంధమైన వాటిని న్యాయసేవాధికార సంస్థల ద్వారా పరిష్కరిస్తున్నారు.

అవగాహన కల్పించాంలక్ష్మీశారద, జిల్లా ప్రధాన న్యాయమూర్తి

నేడు నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాం. ఇప్పటికే న్యాయవాదులు, పోలీసు, ఎక్సైజ్ అధికారులతో సమీక్ష నిర్వహించాం. కక్షిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

## నిర్లక్ష్యం.. అభివృద్ధికి ఆటంకం

మెదక్ : మెదక్ మండలం రాయిన్‌పల్లిలో మత్స్యకారులకు 2017లో రూ.5 లక్షలతో సామాజిక భవన నిర్మాణం చేపట్టారు. స్లాబ్ వరకు పూర్తి చేసి వదిలేశారు. ఆ తర్వాత రూ.3 లక్షలు కేటాయించగా.. పనులు కొనసాగలేదు. మండలంలో ఏడు గ్రామాల్లో ఏసీడీపీ నిధులతో సామాజిక భవనాలకు రూ.46 లక్షలు కేటాయించగా, ఇప్పటివరకు కేవలం ఒక్క చోటే పూర్తయింది. ఐదు చోట్ల ప్రారంభం కాకపోవడం గమనార్హం.హవేలిఘనపూర్ మండలం బ్యాతోల్‌లో రూ.5 లక్షలతో ఎస్సీ సామాజిక భవనం నిర్మించారు. స్లాబ్ వేయగా, మిగిలిన పనుల పూర్తికి ఇటీవల అదనంగా రూ.5 లక్షలు కేటాయించారు. ఇంకా పూర్తికాలేదు.పట్టణాలు, పల్లెల్లో అభివృద్ధి పనులకు శాసనసభ నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం (ఏసీడీపీ) కింద నిధులు కేటాయించగా పనులు చేపడుతున్నారు. కానీ అరకొర కేటాయింపులతో ఏళ్లుగా అసంపూర్తిగా ఉంటున్నాయి. ఏడాదిలోపు పూర్తిచేయాలనే నిబంధన ఎక్కడా అమలు కాకపోవడం గమనార్హం. కొన్నింటికి నిధులు లేకపోవడం, మరికొన్నింటికి పైసలున్నా సరిపోవనే కారణంతో గుత్తేదారులు ముందుకు రావడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. కరోనా సమయంలో..జిల్లాలో మెదక్, నర్సాపూర్ శాసనసభ నియోజకవర్గాలతో పాటు ఇతర ఎనిమిది మండలాలు ఆయా నియోజకవర్గాల పరిధిలోకి వస్తాయి. రెండో సారి తెరాస అధికారంలోకి వచ్చాక 2020-21 ఆర్థికసంవత్సరంలో నిధులు కేటాయించగా, కరోనా కారణంగా వాటిని ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేశారు. ఆయా ఆర్థిక సంవత్సరాల్లో మంజూరైన నిధులతో ఇప్పటి వరకు పనులు పూర్తి చేయకపోవడం గమనార్హం.

పెంచినా అంతే..2022-23 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం ఏసీడీపీ నిధుల కోటా పెంచింది. గతంలో రూ.2.50 కోట్లు ఉండగా, రూ.3



కోట్లకు పెంచింది. ఇప్పటి వరకు కేవలం మెదక్ నియోజకవర్గం నుంచి 30 పనులకు రూ.1.50 కోట్లతో ప్రతిపాదనలు ప్రణాళిక శాఖకు అందాయి. వాటిలో ఇప్పటివరకు రెండు పనులు పూర్తయ్యాయి. నర్సాపూర్ నుంచి ఇంకా ప్రతిపాదించలేదు. నెలన్నర రోజుల్లో ఆర్థికసంవత్సరం ముగియనుంది. ఆలోగా కనీసం పనులైనా ప్రారంభించాల్సి ఉంది.

నామినేషన్ పద్ధతికే మొగ్గుఏసీడీపీ నిధులు రూ.5 లక్షలు దాటితే టెండరు వేయాలి. రూ.5 లక్షల వరకు నామినేషన్ పద్ధతిపై పనులు అప్పగించే అవకాశం ఉంది. దీన్ని కొందరు ప్రజాప్రతినిధులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. బినామీ పేర్లతో పనులు చేపట్టడమో, అనుచరులకు అప్పగించడమో చేస్తున్నారు. దీనికి తోడు పంచాయతీరాజ్ శాఖ అంచనాలకు తగ్గట్టుగా నిధులు రాకపోవడం మరో కారణం. ఎంపీ కోటా కింద మంజూరైనవి సైతం పూర్తి కాలేదు.

సకాలంలో పూర్తి చేస్తాం

సత్యనారాయణరెడ్డి, ఈఈ, పంచాయతీరాజ్ శాఖ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మెదక్ నియోజకవర్గం నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. ఎక్కువగా సామాజిక భవనాలకు కేటాయించాలని సూచించారు. ఇది వరకు సీడీపీ నిధులతో చేపడుతున్న పనుల్లో అసంపూర్తిగా ఉన్న వాటికి నిధులు ప్రతిపాదిస్తే సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

# ఐక్యతా రాగం.. విజయ తీరం

నర్సాపూర్: నేతలంతా ఐక్యంగా పనిచేయడంతో భారాస విజయం చేజిక్కించుకుంది. నర్సాపూర్ అసెంబ్లీ స్థానం నుంచి ఆ పార్టీ అభ్యర్థి సునీతా లక్ష్మారెడ్డి 8,855ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ఆరోసారి బరిలో నిలిచిన సునీతారెడ్డి ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. విజయానికి సర్వశక్తులు ఒడ్డారు. గతంలో హ్యాట్రిక్ సాధించారు. నాలుగోసారి ఆమె శాసనసభలో అడుగిడుతున్నారు. ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని కాదని సునీతారెడ్డి టికెట్ దక్కించుకోవడంతోనే ఆమె విజయానికి బాటలుపడ్డాయి. 2014, 2018 ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు మదన్‌రెడ్డి చేతిలో ఓటమి చెందిన ఆమె.. భారాసకు లభిస్తున్న ఆదరణను చూసి 2019లో ఆ పార్టీలో చేరారు.

8855 మెజార్టీ సాధించిన సునీతా లక్ష్మారెడ్డి

ఆచితూచి అడుగులు వేస్తూ...

నియోజకవర్గంలో మదన్‌రెడ్డితో సఖ్యతగా ఉంటూ ఆయన వెంట నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనుల్లో పాల్గొన్నారు. అలా నియోజకవర్గంలో పట్టు సాధించారు. సునీతారెడ్డి, మదన్‌రెడ్డిలు కలిసి పనిచేసినా పార్టీ శ్రేణులు మాత్రం వేర్వేరు వర్గాలుగా ముందుకు సాగారు. సీఎం కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా ప్రచారంలో ఉన్న మదన్‌రెడ్డికి కాదని సునీతారెడ్డికి టికెట్ కేటాయిస్తున్నారని తెలియడంతో మదన్‌రెడ్డి వర్గీయులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మంత్రి హరీశ్‌రావు ఇంటివద్ద ధర్నా చేశారు. సీఎం కేసీఆర్.. మదన్‌రెడ్డిని ఒప్పించి.. బి-ఫారంను ఆయన చేతుల మీదుగా సునీతారెడ్డికి ఇప్పించారు. గెలుపు బాధ్యతల్ని ఆయనకే అప్పగించారు.

ప్రచారం హోరెత్తించి

తొలుత మందకోడిగా ప్రచారం మొదలైనా, గడువు దగ్గర పడినకొద్దీ పరుగులు పెట్టించారు. సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించారు. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు రోడ్‌షోలో పాల్గొన్నారు. కాంగ్రెస్, భాజపాలో టికెట్ ఆశించి రాకపోవడంతో గాలి అనిల్‌కుమార్, సింగాయిపల్లి గోపిలు భారాసలో చేరారు. వీరు కూడా సునీతారెడ్డి విజయానికి శ్రమించారు. సునీతారెడ్డి ఇక్కడి నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడం, ఐదేళ్లపాటు మంత్రిగా అందించిన సేవలను గుర్తించిన ఓటర్లు ఆమెను ఆదరించారు. రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా ఆమె ప్రజల మధ్యనే ఉండటం, సీఎంఆర్‌ఎఫ్ పథకం ద్వారా చాలామందికి ఆర్థిక సహాయం అందించడానికి కృషి చేయడం కలిసి వచ్చింది. భాజపా, కాంగ్రెస్‌ల అసంతృప్తి సైతం అనుకూలించిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ప్రత్యర్థులు కొత్తవారు కావడం, వారికి ప్రచారం నిర్వహించడంపై అవగాహన లేకపోవడం కలిసి వచ్చింది.

మంత్రి హరీశ్ ప్రత్యేక చొరవ..

సునీతారెడ్డి గెలుపు బాధ్యతల్ని మంత్రి హరీశ్‌రావు తన భుజాన వేసుకొని నర్సాపూర్‌లో ప్రచార శంఖారావం పూరించారు. పార్టీ శ్రేణులను ఒక్కతాటిపైకి తేవడానికి కృషిచేశారు. మదన్‌రెడ్డికి ఎంపీగా అవకాశం కల్పిస్తామని, సిద్దిపేట నుంచి లక్ష మెజార్టీ ఇస్తానని ఆయన వర్గీయుల్లో ఆత్మవిశ్వాసం నింపారు. దీంతో మదన్‌రెడ్డి సైతం సునీతారెడ్డి విజయానికి ఉత్సాహంతో పనిచేశారు. మదన్‌రెడ్డి, సునీతారెడ్డి వర్గాలు కలిసి పనిచేశాయి. ఆ తర్వాత సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లు ప్రచారానికి వచ్చినా మదన్‌రెడ్డిని ఎంపీని చేస్తామని ప్రకటన చేయకపోవడంతో ఆయన వర్గం కొంత ఆలోచనలో పడింది. పార్టీ నియోజకవర్గ బాధ్యులుగా ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డిని నియమించారు. ఆయన అందరినీ సమన్వయం చేయడంలో కృషి చేశారు. మంత్రి హరీశ్‌రావు తరచూ నియోజకవర్గ ముఖ్య నేతల్ని సమన్వయం చేస్తూ, మదన్‌రెడ్డి వర్గంపై ఆరా తీస్తూ ఎవరు అసంతృప్తికిలోనైనా బుజ్జగిస్తూ వచ్చారు. పార్టీలో ఎలాంటి అసంతృప్తి లేదని కలిసికట్టుగా ప్రచారాన్ని హోరెత్తించారు.

నర్సాపూర్ నియోజకవర్గం

సునీతారెడ్డికి దక్కిన విజయం

నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి భారాస అభ్యర్థి సునీతా లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డిపై 8,855 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. 14 టేబుళ్లపై 24రౌండ్లలో ఓట్ల లెక్కింపు చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. నర్సాపూర్

# వానరాలతో పరేషాన్

కరీంనగర్: కరీంనగర్ స్మార్ట్ సిటీ కొన్ని రోజుల నుంచి కోతుల బెడదతో నానా తంటాలు పడుతోంది. సిటీలోని పలు వీధుల్లో వానరాలు బీభత్సం సృష్టించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వీధుల్లో కుక్కల బెడద ఉండగా.. ఇటీవలీ కాలంలో తగ్గింది. తీరా కుక్కల బెడద తగ్గిందని అనుకున్న సీటిజన్లకు అంతలోనే కోతుల బెడద వచ్చి పడింది. వీధుల్లోని ఇళ్లలోకి కోతులు చొరబడి రచ్చరచ్చ చేస్తున్నాయని, ఎదురు తిరిగితే పైకి వచ్చి కొరుకుతున్నాయని వాపోతున్నారు. హోటళ్లు, పండ్ల దుకాణాలు తదితర వ్యాపార కేంద్రాల్లో కోతులు చొరబడి నానా బీభత్సం సృష్టిస్తున్నాయంటున్నారు. నగరపాలక సంస్థ అధికారులు చొరవ తీసుకొని కోతుల బెడద నుంచి తప్పించాలని



కోరుతున్నారు.

గుంపులుగుంపులుగా..

నగరంలోని చాలా డివిజన్లలో కోతులు గుంపులుగుంపులుగా తిరుగుతున్నాయి. ఒకేసారి సుమారు 50కి పైగా కోతులు ఒక్కసారిగా ఇళ్లు, రేకులపైకి ఎక్కి చిందనవందర చేస్తున్నాయి. ఇలా చాలా వీధుల్లో కూడా ఇదే పరిస్థితి ఉందని వాపోతున్నారు. కోతులను కట్టిపడేసే మార్గం లేదా అంటున్నారు పలు కాలనీల వాసులు. కోతులు తమ పిల్లలపైకి వచ్చి ఇబ్బంది పెడుతున్నాయంటున్నారు. వెంటనే అధికారులు కోతులన్నింటిని వేరే చోటుకి పంపించే ప్రయత్నాలు చేపట్టాలని కోరుతున్నారు.

# హస్తం జోరు.. ఆధిక్యాల హోరు



ఖమ్మం : ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ ఖిల్లా అని మరోసారి నిరూపితమైంది. హస్తం పార్టీ అభ్యర్థులు ఊహించని ఆధిక్యాలతో విజయబావుటా ఎగురవేసి ప్రభంజనం సృష్టించారు. పది నియోజకవర్గాలకు గాను కాంగ్రెస్, సీపీఐ కూటమి తొమ్మిది స్థానాల్లో విజయదుందుభి మోగించింది. వార్ వన్ సైడ్ అన్నట్లుగానే సాగిన ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థుల ఆధిక్యాలు రౌండ్ రౌండ్‌కూ భారీగా నమోదయ్యాయి. ఒక్క భద్రాచలం మినహా మరే నియోజకవర్గంలోనూ భారాస అభ్యర్థులు కాంగ్రెస్‌కు పోటీ ఇవ్వలేకపోయారు. ఉమ్మడి జిల్లాలో ఒక్క స్థానం ఆనవాయితీని భారాస మళ్లీ కొనసాగించింది. ఈసారి భద్రాచలం స్థానంలో తెల్లం వెంకట్రావు గెలుపుతో గులాబీ పార్టీ సరిపెట్టుకుంది. ఈ ఎన్నికల్లో మంత్రి పువ్వాడ అజయ్, భారాస ముఖ్యనేతలు కందాళ ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, రేగా కాంతారావు, వనమా వెంకటేశ్వరరావు పరాజయం పాలయ్యారు. కాంగ్రెస్ కీలక నేతలు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఘనవిజయం అందుకున్నారు.

రౌండ్ రౌండ్‌కూ.. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల ఓటర్లు వరుసగా మూడో శాసనసభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత జరిగిన 2014, 2018 ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుచుకున్న కాంగ్రెస్.. ఈసారి అదే ఒరవడిని కొనసాగించి తిరుగులేని విజయాలు నమోదుచేసింది. ఆదివారం ఉదయం పోస్టల్ బ్యాలెట్లతో లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవగా.. అన్ని నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్‌కు మొగ్గు స్పష్టంగా కనిపించింది. ఉదయం 8.30 గంటలకు ఈవీఎంల ఓట్లు లెక్కించటం మొదలెట్టారు. తొలి రౌండ్‌లో సత్తుపల్లి మినహా మిగతా నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు ఆధిక్యం ప్రదర్శించారు. కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థి కూనంనేని ముందంజలో నిలుస్తూ వచ్చారు. సత్తుపల్లిలో తొలి రౌండ్‌లో భారాస అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య స్వల్ప ఆధిక్యం ప్రదర్శించినా రెండో రౌండ్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి మట్టా రాగమయి హవా కొనసాగింది. భద్రాచలం నియోజకవర్గంలోనూ కొన్ని రౌండ్ల పాటు భారాస-కాంగ్రెస్ మధ్య నువ్వా నేనా అన్నట్లు పోరు సాగింది. తొలి మూడు రౌండ్లు కాంగ్రెస్, ఆ తర్వాత రెండు రౌండ్లు భారాసకు ఆధిక్యం కనిపించింది. మళ్లీ ఒకసారి కాంగ్రెస్ ఆధిక్యం చూపింది. తర్వాతి రౌండ్లలో భారాస స్పష్టమైన ఆధిపత్యం సాగించింది. మిగిలిన అన్ని నియోజకవర్గాల్లోనూ తొలి రౌండ్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థులు స్పష్టమైన ఆధిక్యం కనబరిచారు. ప్రతి రౌండ్‌లో వేల ఓట్ల ఆధిక్యంతో కాంగ్రెస్ అభ్యర్థులు విజయతీరాలకు దూసుకెళ్లారు. రాష్ట్రంలోనే తొలి ఫలితం అశ్వారావుపేటకు సంబంధించి వెల్లడవగా.. ఖమ్మం ఫలితం రాత్రి 7 గంటల సమయంలో వచ్చింది.

వారికి మోదం.. వీరికి ఖేదం..మధిరలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క భారీ ఆధిక్యంతో విజయబావుటా ఎగురవేశారు. ఖమ్మంలో కాంగ్రెస్ తరఫున బరిలో నిలిచిన తుమ్మల నాగేశ్వరరావు గెలిచి పువ్వాడ అజయ్‌పై ప్రతీకారం తీర్చుకున్నారు. 2014 ఎన్నికల్లో తుమ్మలపై పువ్వాడ విజయం సాధించిన విషయం విదితమే. పాలేరు నుంచి తొలిసారి శాసనసభ ఎన్నికల బరిలో నిలిచిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి భారీ మెజారిటీని సొంతం చేసుకున్నారు. అశ్వారావుపేటలో కాంగ్రెస్ అభ్యర్థి జారె ఆదినారాయణ తిరుగులేని విజయం సాధించారు. కాంగ్రెస్ ప్రభంజనంలో భారాస కీలక నేతలకు ఘోరపరాజయం తప్పలేదు. ఎన్నికల్లో సీపీఎం, జనసేన, భాజపా అభ్యర్థులు ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. పాలేరు బరిలో నిలిచిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మూడోస్థానానికి పరిమితమయ్యారు. కాంగ్రెస్‌లో జోష్ రాష్ట్రంలో అధికారంలోకి రావటంతోపాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ సత్తా చాటడంతో ఆపార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరుస్తోంది. 2018 ఎన్నికల్లో జిల్లాలో అత్యధిక స్థానాలు గెలిచినప్పటికీ ఆతర్వాత మారిన రాజకీయ సమీకరణాలతో పలువురు ఎమ్మెల్యేలు భారాస గూటికి చేరడంతో హస్తం పార్టీ శ్రేణుల్లో స్తబ్దత నెలకొంది. అయినప్పటికీ అధికార పార్టీకి దీటుగా అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ బలోపేతం కోసం నాయకులు పనిచేశారు. దీనికి తోడు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు చేరికతో ఆపార్టీ మరింత బలోపేతమైంది. ఈ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఎంపికలోనూ పక్కా వ్యూహం అనుసరించారు. భారాస నాయకుల్లో ఒక్కరిని కూడా అసెంబ్లీ గేటు తాకనీయబోనంటూ పొంగులేటి శపథం చేశారు. భట్టి, తుమ్మల సైతం ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని శ్రేణుల్ని నడిపించారు. తద్వారా అత్యుత్తమ ఫలితాలు సాధించగలిగారు.

ఎవరికి ఎన్ని కాంగ్రెస్: 8

భారాస: 1

సీపీఐ: 1

# కాషాయ జెండాకే అండ..



నిర్మల్ : నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల ఓటర్లు కాషాయ జెండాను రెపరెపలాడించారు. ఊహకందని ఆధిక్యాన్ని కట్టబెట్టి భాజపాకు అండగా నిలిచారు. ఈ రెండు స్థానాల్లోనూ తొలిసారి కమలం వికసించింది. నిర్మల్‌లో ఆ పార్టీ అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తిరుగులేని మెజార్టీని కట్టబెట్టిన ఓటర్లు చరిత్ర సృష్టించారు. ముథోల్ భాజపా అభ్యర్థి పవార్ రామారావుపటేల్‌కు పట్టం కట్టారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసిన ఆదివాసీ బిడ్డ వెడ్మబొజ్జును ఖానాపూర్ ప్రజలు అక్కున చేర్చుకున్నారు. మూడు నియోజకవర్గాల్లోని ఓటర్లు విలక్షణ తీర్పునిచ్చి అందరినీ విస్మయం కలిగేలా చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగింది. నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో భాజపా ఆది నుంచి ఆధిపత్యం కొనసాగించగా.. ఖానాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ అదే తీరును కొనసాగించింది. మధ్య రౌండ్లలో భారాస, భాజపాలు ఎక్కువ ఓట్లు సాధించి మెజార్టీ తగ్గించారు. ఫలితాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు ఆయా పార్టీల అభ్యర్థులకు మద్దతుగా అనుచరగణం భారీగా తరలివచ్చింది.

నిర్మల్‌లో ఆదినుంచి ఆధిపత్యమే..

భాజపా అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డికి ఆది నుంచి ఆధిపత్యమే వచ్చింది. తొలి రౌండ్ నుంచి 22వ రౌండ్ వరకు తన ఆధిక్యతను కొనసాగుతూ వచ్చింది. ఆఖరి రౌండ్ వరకు భారాస, కాంగ్రెస్ పార్టీలు పోటీని ఇవ్వలేక చతికిలపడిపోయాయి. సారంగాపూర్ మండలం తొలి అయిదు రౌండ్లలోనూ దాదాపు పది వేలకుపైగా మెజార్టీ వచ్చింది. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీహరిరావు సొంత మండలమైన మామడలో ఆ పార్టీకి ఎక్కువ ఓట్లు పడే అవకాశం ఉంటుందని అందరూ భావించినా.. ఆ మండల ఓటరు కూడా భాజపాకు అండగా నిలిచారు. ఆ తర్వాత లక్ష్మణచాంద, సోన్, నిర్మల్ గ్రామీణ మండలాల్లోనూ ఏలేటికి మద్దతుగా నిలిచారు. నిర్మల్ పట్టణంలో భారాసకు భారీ ఆధిక్యం వస్తుందని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆశలు పెట్టుకున్నా.. వారి ఆశలను పట్టణ ఓటర్లు వమ్ముచేస్తూ భాజపావైపు మొగ్గుచూపారు. దిలావర్‌పూర్, నర్సాపూర్(జి) మండలాల్లోని ఓటర్లు కూడా కమలం వైపు మొగ్గుచూపారు. నియోజకవర్గం ఏర్పడినప్పటి ఇప్పటివరకు 15 సార్లు జరిగిన శాసనసభ ఎన్నికల్లో రాని మెజార్టీ ఈ సారి 50 వేలకుపైగా ఆధిక్యతను కట్టబెట్టారు.

ముథోల్‌లోనూ..

ముథోల్ నియోజకవర్గం తొలి రౌండ్ నుంచి భాజపా ఆధిక్యతను ప్రదర్శిస్తూ వచ్చింది. 10 రౌండ్ల వరకు 13,187 ఓట్ల ఆధిక్యతను చాటిన భాజపా 11వ కాస్త వెనుకంజ వేసింది. 11వ రౌండ్‌లో మొదటి సారి భారాస అభ్యర్థి జి.విఠల్‌రెడ్డికి 6,290 ఓట్లు రాగా.. భాజపా మెజారిటీ 8,878కి దిగజారింది. మళ్లీ 12వ రౌండ్ నుంచి 19వ రౌండ్ వరకు ప్రతి రౌండ్‌లో వెయ్యికిపై ఓట్లు భాజపా ఖాతాలో పడడంతో ఆ పార్టీ మెజారిటీ 20,624 చేరింది. 20వ రౌండ్‌లో భారాస స్వల్ప అధిక్యాన్ని చూపి 217 ఓట్లు తగ్గించింది. అనంతరం వరుసగా 23 రౌండ్ల వరకు భాజపా అధిక్యతతో విజయం సాధించింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బి.నారాయణరావు పటేల్ మొదటి నుంచి వెనుకంజలో ఉన్నారు. పోస్టల్ బ్యాలట్ ఓట్లలోనూ భాజపాకు 751 ఓట్లు రాగా భారాసకు 335, కాంగ్రెస్‌కు 99 ఓట్లు వచ్చాయి. భాజపా అభ్యర్థి పి.రామారావు పటేల్ 96,799 ఓట్లు సాధించి 23,419 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందగా, భారాస అభ్యర్థి జి.విఠల్‌రెడ్డి 73,380ఓట్లతో రెండవ స్థానంలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి బి.నారాయణరావు పటేల్ 15,394 ఓట్లతో మూడవ స్థానానికి పరిమితమయ్యారు.

కాంగ్రెస్‌దే ఆధిక్యం

కడెం: ఖానాపూర్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉత్కంఠభరితంగా సాగింది. కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు పటేల్, భారాస అభ్యర్థి జాన్సన్ నాయక్, భాజపా అభ్యర్థి రాథోడ్ రమేష్‌లు పోటాపోటీగా దూసుకొచ్చారు. మొత్తం 305 పోలింగ్ బూత్‌లలో పోలైన ఓట్లను 22 రౌండ్లలో లెక్కించారు. కాంగ్రెస్ అభ్యర్థి మొదటి రౌండ్ నుంచి ఆధిక్యత కనబరిచారు. భాజపా ఆరు రౌండ్లలో(6, 8, 11, 16, 18, 19) ఇద్దరికన్నా కొన్ని ఎక్కువ ఓట్లు సాధించారు. భారాస అభ్యర్థి జాన్సన్‌నాయక్ నాలుగు రౌండ్లలో(13, 14, 15, 17) కొన్ని ఎక్కువ ఓట్లు సాధించారు. ఆధిక్యతలో మాత్రం కాంగ్రెస్ అభ్యర్థిని దాటలేకపోయారు. ఒక మండలం కాకుంటే ఇంకో మండలంలో ముందంజలోకి వస్తామని భాజపా, భారాస అభ్యర్థులు, ఆ పార్టీల శ్రేణుల్లో కనిపించింది. రసవత్తరంగా సాగిన ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థి వెడ్మ బొజ్జు 4,703 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. మొత్తం పోలైన 1,72,412 ఓట్లలో కాంగ్రెస్ అభ్యర్థికి 58,210 ఓట్లురాగా, భారాస అభ్యర్థికి 53,921 ఓట్లు, భాజపా అభ్యర్థికి 51,518 ఓట్లు వచ్చాయి. పోస్టల్ ఓట్లు కాంగ్రెస్ అభ్యర్థికి 645, భాజపా అభ్యర్థికి 860, భారాస అభ్యర్థికి 231 వచ్చాయి. పోస్టల్ ఓట్లను కలిపితే కాంగ్రెస్ అభ్యర్థికి 58,855 ఓట్లురాగా సమీప ప్రత్యర్థి భారాస అభ్యర్థి జాన్సన్‌నాయక్‌కు 54,152 ఓట్లు వచ్చాయి. భాజపా అభ్యర్థి రాథోడ్ రమేష్‌కు 52,378 ఓట్లు వచ్చాయి.

# నెరవేరని 'హ్యాట్రిక్' కల

హైదరాబాద్: రాష్ట్రంలో వరుసగా మూడుమార్లు అధికారంలోకి వచ్చి 'హ్యాట్రిక్'సాధించేందుకు భారత్ రాష్ట్ర సమితి సర్వశక్తులూ ఒడ్డినా ఆశించిన ఫలితం రాబట్టలేకపోయింది. పార్టీ పేరు మార్పుతో ఓ వైపు జాతీయ రాజకీయాల్లో అరంగేట్రానికి బాటలు వేసుకుంటూనే అసెంబ్లీ ఎన్నికల కోసం ఏడాది కాలంగా సన్నద్ధమైనా అధికారం పీఠం నుంచి వైదొలగాల్సి వచ్చింది. అభ్యర్థుల ఎంపిక మొదలుకుని బీ ఫామ్‌ల జారీ, ఇతర పార్టీల నుంచి చేరికలు, ఎన్నికల ప్రచార సభలు తదితరాలు అన్నింటా విపక్ష పార్టీలతో పోలిస్తే ముందంజలో ఉన్నా.. అధికారం చేపట్టేందుకు అవసరమైన మేజిక్ ఫిగర్‌కు చేరువ కాలేకపోయింది.

అసెంబ్లీలో బీఆర్‌ఎస్‌కు 104 మంది సభ్యుల సంఖ్యా బలం ఉండటం, అందులో సగం మందికి పైగా ఎమ్మెల్యేలు వరుసగా రెండు కంటే ఎక్కువ పర్యాయాలు గెలిచిన వారే ఉండటం ప్రతికూలంగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సుమారు 35 మంది పార్టీ ఎమ్మెల్యేలపై క్షేత్ర స్థాయిలో తీవ్ర ప్రతికూలత నెలకొందని నిఘా వర్గాలు, వివిధ సంస్థలు నివేదికలు ఇచ్చినా వాటిని పరిగణనలోకి తీసుకోకపోవడం కూడా నష్టాన్ని కలిగించినట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో సిట్టింగ్ కార్పొరేటర్లను మార్చక పోవడం వల్ల నష్టం జరిగిందని తేలినా.. మళ్లీ 'సిట్టింగులకే టికెట్లు'అంటూ పెద్దపీట వేయడం నష్టం చేకూర్చినట్లు ఫలితాల సరళి వెల్లడిస్తోందని అంటున్నారు. 13 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు నిరాకరించి కొత్త వారికి అవకాశమిచ్చిన చోట 9 మంది గెలుపొందడమే ఇందుకు నిదర్శనమని చెబుతున్నారు. ఉద్యోగ నోటిఫికేషన్లు, రుణ మాఫీ, డబుల్ బెడ్ రూం ఇళ్లు, దళితబంధు, బీసీబంధు పథకాలు వంటి అంశాలు, ఎమ్మెల్యేలు, వారి అనుచరుల వ్యవహార శైలి ప్రభుత్వ వ్యతిరేకతను మూటగట్టడంలో కీలకంగా మారాయని అంటున్నారు.

స్థానికంగా దృష్టి కేంద్రీకరించలేకపోయారా?

ఈ ఏడాది మార్చి నుంచే ఎన్నికల సన్నద్ధతను ప్రారంభించి తొలి విడతలో జిల్లా కలెక్టరేట్లు, పార్టీ జిల్లా కార్యాలయాల ప్రారంభం సందర్భంగా ఎన్నికల ప్రచారాన్ని తలపించేలా సభలు నిర్వహించారు. ఏప్రిల్, మే నెలల్లో నియోజకవర్గ స్థాయిలో ఆత్మీయ సమ్మేళనాలతో కేడర్‌ను కార్యోన్ముఖుల్ని చేసే పనికి పూనుకున్నారు. జూన్‌లో దశాబ్ది ఉత్సవాల పేరిట సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లో ప్రచారం చేశారు. అందరికంటే ముందుగా ఆగస్టులోనే 105 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించి అంతర్గత అసమ్మతి సర్దుబాటుకు పూనుకున్నారు. నామినేషన్ల ప్రక్రియ మొదలు కాకమునుపే బీ ఫామ్‌లు జారీ చేశారు. ఇంత చేసినా ఆశించిన ఫలితం దక్కలేదు. పార్టీని జాతీయ స్థాయిలో విస్తరించేందుకు టీఆర్‌ఎస్ పేరును ఏడాది క్రితం బీఆర్‌ఎస్‌గా మార్చడం, పార్టీ పేరులో తెలంగాణ పదం లేకపోవడంపై పార్టీ నేతల్లో కొంత అసంతృప్తి వ్యక్తమైంది. మరోవైపు పొరుగునే ఉన్న మహారాష్ట్రపై దృష్టి కేంద్రీకరించే క్రమంలో స్థానికంగా పార్టీ, ప్రభుత్వంపై కేసీఆర్ అంతగా దృష్టి కేంద్రీకరించలేదనే అభిప్రాయం కూడా ఉంది.

అభ్యర్థుల ప్రకటనకు ముందూ, తర్వాత టికెట్ దక్కదని తేలడంతో పార్టీని వీడిన పొంగులేటి, తుమ్మల వంటి నేతలు తీరని నష్టం కలిగించారని అంటున్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకు ధీటుగా ప్రకటించిన మేనిఫెస్టోను ఓటర్లలోకి తీసుకెళ్లేందుకు చేసిన ప్రయత్నాలు కూడా పాక్షిక ఫలితాన్నే ఇచ్చాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

'తెలంగాణ మోడల్'కు మిశ్రమ స్పందన

భారీగా ఓట్లు సాధిస్తుందని భావించిన 'తెలంగాణ మోడల్'నినాదం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు పొరుగునే ఉన్న ఉమ్మడి రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో భారీగా సీట్లను సాధించి పెట్టింది. అయితే 'తెలంగాణ మోడల్'లో అంతర్భాగమైన సంక్షేమ పథకాలు ఓట్ల వర్షం కురిపిస్తాయనే లెక్కలు తారుమారై ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మిశ్రమ, ఇతర జిల్లాల్లో అరకొర ఫలితాన్నే ఇచ్చాయి. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిథ్యం వహిస్తున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 13 స్థానాలకు ఐదు సీట్లు బీఆర్‌ఎస్ ఖాతాలో పడ్డాయి.

ఉద్యమ కాలం నుంచి పార్టీకి వెన్నుదన్నుగా నిలిచిన ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లోకేవలం రెండేసి స్థానాలకు మాత్రమే బీఆర్‌ఎస్ పరిమితమైంది. 2018 ఎన్నికల్లో ఏకపక్ష ఫలితాన్ని అందించిన నల్లగొండలో సూర్యాపేట, మహబూబ్‌నగర్‌లో గద్వాల, ఆలంపూర్‌లో మాత్రమే గెలుపు సాధ్యమైంది. మొదట్నుంచీ పార్టీకి పూర్తి ప్రతికూలంగా ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లా ఓటరు ప్రస్తుత ఎన్నికలోనూ అదే తీరును ప్రదర్శించడం గమనార్హం.

కాంగ్రెస్‌కు హైదరాబాద్ నో

ప్రభుత్వ వ్యతిరేకతను అధిగమిస్తూ హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి రంగారెడ్డి, మెదక్ జిల్లాలు బీఆర్‌ఎస్‌కు వెన్నుదన్నుగా నిలిచాయి. హైదరాబాద్‌లోని 15 స్థానాలకు గాను మిత్రపక్షాలైన బీఆర్‌ఎస్, ఎంఐఎం చెరో ఏడు స్థానాలు దక్కించుకున్నాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 14 సీట్లకు గాను పది స్థానాలు అధికార పార్టీ ఖాతాలోనే పడ్డాయి. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు పరిసర నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అభివృద్ధి మంత్రానికి ఓటర్లు ఏకపక్షంగా మద్దతు పలికారు. పొరుగునే ఉన్న ఉమ్మడి మెదక్ జిల్లాలో పది సీట్లకు గాను మంత్రి హరీశ్‌రావు సర్వశక్తులూ ఒడ్డటంతో సిద్దిపేట, గజ్వేల్ సహా ఏడు చోట్ల పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల్లోనూ బీఆర్‌ఎస్‌కు ప్రాతినిథ్యం దక్కగా, అధికార పగ్గాలు చేపడుతున్న కాంగ్రెస్‌కు హైదరాబాద్ జిల్లాలో ఒక్క సీటూ దక్కకపోవడం గమనార్హం.

# నమో.. నారసింహా..

పెద్దపల్లి: దేవునిపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతర ఉత్సవాలు, రథోత్సవం వైభవంగా జరిగాయి. ఏటా కార్తీక మాసంలో ఈ వేడుకలు నిర్వహిస్తారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం జరిపించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు స్వామివారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు.

పోటెత్తిన భక్తులు..జిల్లాలోని అన్నిగ్రామాలతోపాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాలు, పొరుగున ఉన్న మహారాష్ట్రకు చెందిన భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దీంతో స్వామివారి సన్నిధి భక్తులతో పోటెత్తింది. పెద్దపల్లి మండలం అందుగులపల్లి నుంచి దేవునిపల్లిలోని ఆలయానికి చేరుకునేందుకు దారి సరిగాలేక భక్తులు కొంత ఇబ్బంది పడ్డారు. వాహనాలను ఆలయానికి దూరంగానే నిలిపియడంతో కాలినడకన ఆలయానికి చేరుకునేందుకు అవస్థలు పడాల్సి వచ్చింది. పార్కింగ్ సమస్య తలెత్తకుండా బసంత్‌నగర్ పోలీసులు చర్యలు తీసుకున్నారు. గుట్టపైకి కాలినడకన..కోరమీసాల స్వామిని దర్శించుకుంటే కోరికలు తీరుతాయని భక్తుల విశ్వాసం. అందుకే గుట్టపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్టును దర్శించుకునేందుకు భక్తులు కాలినడకన గుట్టపైకి ఎక్కారు. కొంతకాలం క్రితం వరకు బండరాళ్లపై పాకుతూ వెళ్లే పరిస్థితి ఉండగా.. భక్తుల సౌకర్యార్థం సమీపంలోని కేశోరాం సిమెంట్ యాజమాన్యం 418 మెట్లు నిర్మించింది. దీంతో భక్తులకు ఉపశమనం లభించింది.

# జిల్లా హస్త గతం



హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా సాగిన కాంగ్రెస్ హవా జిల్లాలోనూ ప్రస్ఫుష్టమైంది. ఫలితంతా నాలుగు నియోజక వర్గాల్లో (కొడంగల్, పరిగి, తాండూరు, వికారాబాద్) కాంగ్రెస్ జెండా రెపరెపలాడింది. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు నుంచే హస్తం ఆధిక్యం ప్రారంభమైంది. దీంతో పార్టీ శ్రేణుల్లో ఆనందం వెల్లివిరిసింది. భారాస దశాబ్ద పాలన చూసిన ప్రజలు ఒకసారి తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చి చూద్దామని మార్పు కోరుకోవడంతోనే కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటర్లు పట్టం కట్టారని విశ్లేషకులు పేర్కొంటున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కొడంగల్ నుంచి బరిలోకి దిగడం, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ముఖ్యమంత్రి అవుతారన్న ప్రచారం మిగతా నియోజకవర్గాలపై ప్రభావం చూపింది. భారాస అమలు చేస్తున్న దళితబంధు, బీసీ బంధు, రుణమాఫీలో జాప్యం వెరసి ప్రజల్లో భారాసపై అసంతృప్తి ఏర్పడింది.

2018 ఎన్నికల్లో మైనార్టీలు భారాస వైపు మొగ్గు చూపగా, ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతుగా నిలిచారు. మైనార్టీలు అధికంగా ఉన్న పోలింగ్ కేంద్రాల్లో కాంగ్రెస్‌కు ఆధిక్యం రావడమే ఇందుకు నిదర్శనం. నాలుగు నియోజక వర్గాలో విజేతలు, పరాజితుల కారణాలపై కథనం.

**కాపాడుకున్న క్యాడరే గెలిపించింది**

వికారాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ప్రసాద్‌కుమార్ విజయానికి పలు అంశాలతోపాటు కాలం కలిసొచ్చింది.తెలంగాణ ఇచ్చిన పార్టీగా ప్రజల్లో కాంగ్రెస్‌కు ఉన్న సానుకూలత, మ్యానిఫెస్టోలో పొందుపర్చిన జనాకర్షణ పథకాలకు తోడు ప్రభుత్వ వ్యతిరేక ఓటు కాంగ్రెస్‌కు పడటంతో గెలుపు సులభమైంది. ఈ నియోజకవర్గంలో 2014, 2018లలో జరిగిన ఎన్నికల్లో భారాస అభ్యర్థులే విజయం సాధించినా, క్యాడర్ చెదిరిపోకుండా గ్రామాల్లో పర్యటించి ప్రసాద్‌కుమార్ కాపాడుకున్నారు. రేవంత్‌రెడ్డి చరిష్మా, మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీలు మొగ్గు చూపడంతో విజయం వరించింది.

**అసంతృప్తిని పట్టించుకోని అధిష్ఠానం**

భారాస అభ్యర్థి ఆనంద్‌పై నాయకుల్లో గూడుకట్టుకున్న వ్యతిరేకతతో అభ్యర్థిని మార్చాలని అసంతృప్త నాయకులు సమావేశాలు పెట్టి మరీ నిరసన గళం వినిపించారు. అయినా అభ్యర్థిని మార్చకపోవడంతో పలువురు ముఖ్య నాయకులు భారాసను వీడి కాంగ్రెస్‌లో చేరారు. దీనికి తోడు మంత్రి మహేందర్‌రెడ్డి వర్గానికి చెందిన పలువురు నాయకులు పార్టీలో కొనసాగుతూనే పరోక్షంగా కాంగ్రెస్ అభ్యర్థికి సహకరించారు. ఇవన్నీ ఓటమికి కారణమయ్యాయి. భాజపా, బీఎస్పీల ప్రభావం నామమాత్రంగా కనించింది.

**అలుపెరుగక.. అనుకున్నట్లే సాధించి..**

పరిగి నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ తమ్మన్నగారి రామ్మోహన్‌రెడ్డికి పట్టం గట్టారు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో అనూహ్య విజయం సాధించారు. 'నువ్వా..నేనా' అనే రీతిలో జరిగిన పోటీ చివరకు ఆయనకు విజయం చేకూర్చింది. సమీప భారాస అభ్యర్థి కొప్పుల మహేష్‌రెడ్డిపై 23,876 ఓట్ల ఆధిక్యంతో ఘన విజయం సాధించారు. ఈఎన్నికల్లో రామ్మోహన్‌రెడ్డికి 98,103 ఓట్లు పడగా మహేష్‌రెడ్డికి 74,227 ఓట్లు వచ్చాయి. పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలు ప్రజలను బాగా ఆకర్షించడంతో విజయానికి బాటలు పడ్డాయి.

ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు అవినీతి రహిత పాలన, ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని ఆలయంలో చేసిన ప్రమాణం కూడా కలిసి వచ్చింది. దళితబంధు పథకాన్ని కూడా తన ప్రచారంలో వాడుకున్నారు. ప్రజా వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు ఆందోళనలు నిర్వహించి నిరసనలు తెలిపారు.కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్, రేవంత్‌రెడ్డి రోడ్‌షో పరిగిలో నిర్వహించి ఓటర్లలను ఆకట్టుకోవడంలో సఫలీకృతులయ్యారు.

**నిలబెట్టుకోలేకపోయిన 'కొప్పుల'**

మొదటిసారి రాజకీయాల్లోకి వచ్చి పరిగి ఎమ్మెల్యేగా 2018లో గెలుపొందిన భారాస అభ్యర్థి కొప్పుల మహేశ్వర్ రెడ్డి తన స్థానాన్ని నిలబెట్టుకోలేకపోయారు. కుల్కచర్లలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, పరిగిలో కేసీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభలు విజయాన్ని అందించలేకపోయాయి.

**హోరాహోరీ పోరులో.. ఆధిక్యం**

టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో కొడంగల్ బరిలో రేవంత్‌రెడ్డి దిగడంతో అందరి దృష్టి దీనిపైనే నిలిచింది. ఈ స్థానానికి ఈసారి 13 మంది అభ్యర్థులు బరిలో ఉండగా ప్రచారం భారాస, కాంగ్రెస్‌ల మధ్య హోరాహోరీగా సాగింది. ఆదినుంచి రేవంత్ రెడ్డి ఆధిక్యం చూపుతూ వచ్చారు. రేవంత్‌రెడ్డి గెలుపుపై కార్యకర్తలు ధీమాగా ఉన్నప్పటికీ, రాష్ట్ర మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి తన సోదరుడు కొడంగల్ భారాస అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డి విజయం కోసం చేసిన కృషితో పార్టీ ఊపందుకుంది. తరువాత జరిగిన రకరకాల పరిణామాలు, భారాస వ్యతిరేకత రేవంత్ విజయాన్ని ఆపలేకపోయాయి. అంతేకాదు తమ ప్రాంత వ్యక్తి సీఎం అవుతాడనే నమ్మకం, ప్రచారం ప్రజల్లోకి బాగా చొచ్చుకుపోయింది. దీనికితోడు స్వపక్షంలో విపక్షం లేకపోవడం మరింత బలాన్నిచ్చింది. భారాస ఆశలు అడియాసలుకొడంగల్ నియోజకవర్గం నుంచి రెండో సారి విజయం సాధించాలని భావించిన నరేందర్‌రెడ్డి ఆశలు అడియాశలయ్యాయి. ప్రభుత్వ వ్యతిరేకతతో పాటు నమ్ముకున్న వారే మోసం చేస్తూ రావడం మరో కారణమైంది. ప్రభుత్వ పథకాలు సరిగ్గా అందక పోవడం స్థానికంగా వ్యతిరేకతను పెంచింది.భాజపా, బీఎస్పీ పార్టీల ప్రభావం గ్రామాల్లోనే కాదు, పట్టణాల్లోనూ కనిపించకపోవడం గమనార్హం.

## అతివలకు అందని విజయం

మేడిపల్లి: ఉమ్మడి కరీంనగర్ నుంచి ఈ విడత కూడా అతివలకు 'అధ్యక్షా' అనే అవకాశం దక్కలేదు. ప్రధాన పార్టీల్లో కేవలం భాజపా మాత్రమే నలుగురు మహిళలకు టికెట్లు ఇవ్వగా బీఎస్పీ ఒకరికి పోటీ చేసే అవకాశం కల్పించింది. జిల్లాలో 12 నియోజకవర్గాలకు గాను మొత్తం 18 మంది బరిలో నిలిచినా విజయం అందుకోలేకపోయారు. 2014లో చొప్పదండి నుంచి బొడిగ శోభ గెలవగా అంతకుముందు 1998లో మెట్‌పల్లి స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో కొమిరెడ్డి జ్యోతిదేవి విజయం సాధించారు. 1972లో నాటి నుస్తులాపూర్ నియోజకవర్గం నుంచి ప్రేమలతాదేవి, 1952లో సిరిసిల్ల ద్విసభ నియోజకవర్గం నుంచి జేఎం రాజమణిదేవి గెలుపొందారు.



**శ్రావణికి మెరుగైన ఓట్లు**

జగిత్యాల భాజపా అభ్యర్థి బోగ శ్రావణి మెరుగైన ఓట్లు సాధించారు. జిల్లాకేంద్రంలో పురపాలక ఛైర్‌పర్సన్‌గా రాజకీయ అనుభవం, పార్టీ క్యాడర్ కూడా తమదైన రీతిలో ప్రచారం చేయడంతో 42,138 ఓట్లు సాధించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రచారం నిర్వహించిన శ్రావణి జగిత్యాల, రాయికల్ పురపాలక సంఘాల్లోనూ వ్యూహం ప్రకారం ప్రచారం నిర్వహించారు. సిరిసిల్ల నుంచి రాణిరుద్రమ, చొప్పదండి బొడిగ శోభ, రామగుండం కందుల సంధ్యారాణి, పెద్దపల్లి బహుజన్ సమాజ్ పార్టీ తరఫున పెద్దపల్లి నుంచి దాసరి ఉష పోటీలో ఉన్నా గెలుపు తీరాలకు చేరలేకపోయారు. 70 సంవత్సరాల చరిత్రలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి ఇప్పటివరకు కేవలం నలుగురు మాత్రమే విజయం సాధించగా, వరుసగా రెండోసారీ ఒక్కరూ గెలవకపోవడంతో శాసనసభలో ఉమ్మడి జిల్లా నుంచి అతివల ప్రాతినిధ్యం కరవైంది.

## పోటీ ఇవ్వని స్వతంత్రులు

హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ వ్యాప్తంగా బరిలో నిలిచిన స్వతంత్రులు కనీస పోటీ ఇవ్వలేకపోయారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్- మల్కాజిగిరి బరిలో మొత్తం 500 వరకు స్వతంత్రులు రంగంలోకి దిగారు. గతంలో ప్రధాన పార్టీల అభ్యర్థులను సైతం కాదని స్వతంత్ర అభ్యర్థులను గెలిపించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఈసారి ప్రధాన పార్టీలకు రెబల్స్ బెడద లేదు. రాజకీయాలపై ఆసక్తితో పోటీలో నిలిచిన వారు కనీస పోటీ ఇవ్వలేకపోయారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పోల్చితే వీరికి మందీమార్బలం లేకపోవడం



ఒక కారణమైతే.. పోటీలో ఉన్న స్వతంత్రుల్లో ఎక్కువ శాతం మంది సీరియస్‌గా రంగంలోకి దిగకపోవడం మరో కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. ఎక్కడో ఉండి ఎన్నికల సమయానికి వచ్చి పోటీ చేసినంత మాత్రాన ప్రజలు పట్టం కడతారంటే అది కుదరని పని అని చెబుతున్నారు. ఓడినా.. గెలిచినా.. నిత్యం ప్రజలతో సంబంధం ఉన్నవారికి ఈసారి కాకపోయినా.. మరోసారైనా పట్టం కట్టే అవకాశం ఉంటుందని అంటున్నారు

## నోటా.. మాట వినలేదు..!

మహబూబాబాద్ : పోటీలో ఉన్న అభ్యర్థుల్లో ఎవరూ నచ్చకుంటే నోటా (నన్ ఆఫ్ ద అబోవ్)కు ఓటు వేయొచ్చు. ఈసారి ఉమ్మడి వరంగల్ జిల్లాలో నోటా మాట చాలా మంది వినలేదు. 2018లో కంటే ఈసారి తక్కువ మంది దానిని ఎంచుకున్నారు. ఇది హర్షించదగిన విషయమని భావించవచ్చు.ఉమ్మడి జిల్లాలో 12,184 తగ్గాయి..: గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో 33,358 ఓట్లు నోటాకు రాగా.. ఈసారి 21,174 మాత్రమే వచ్చాయి.రాష్ట్రంలోనే వర్ధన్నపేట రెండో స్థానం: ఈసారి రాష్ట్రంలోనే కుత్బుల్లాపూర్ నియోజకర్గంలో నోటాకు అత్యధికంగా 4,079 ఓట్లు పోలయ్యాయి. వర్ధన్నపేట 3612 ఓట్లతో రెండో స్థానంలో నిలిచింది. 2018లో వర్ధన్నపేట 5,874 ఓట్లతో మొదటి స్థానంలో ఉండేది.

## తొలిసారి.. అసెంబ్లీకి




ఆదిలాబాద్ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఫలితాలు ఇతర జిల్లాలతో పోలిస్తే భిన్నంగా వచ్చాయి. జిల్లాలోని పది నియోజకవర్గాల్లో ఎన్నికైన శాసనసభ్యుల్లో ఏడుగురు అసెంబ్లీలో తొలిసారి అడుగుపెడుతున్నారు. వీరిలో కొంత మంది గత రెండు, మూడు విడతలుగా ఎమ్మెల్యే అభ్యర్థులుగా బరిలో ఉన్నా.. విజయం సాధించలేకపోయారు. ఎట్టకేలకు ఈ ఎన్నికల్లో విజేతగా నిలిచి అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు. రాజకీయాల్లో అడుగుపెట్టి దశాబ్దాలు గడుస్తున్నా.. ఇప్పటి వరకు శాసనసభకు వెళ్లలేకపోయారు. అలాంటిది ఈ ఎన్నికల్లో విజయం సాధించి తొలిసారి అసెంబ్లీలో అడుగుపెడుతుండటంతో ఆయా పార్టీల కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గం నుంచి భాజపా తరఫున పోటీ చేసిన పాయల్ శంకర్ విజయం సాధించడంతో తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు. గతంలో ఇదే పార్టీ నుంచి రెండు విడతలుగా, తెలుగుదేశం పార్టీ నుంచి ఒకసారి పోటీ చేసినా.. రెండో స్థానంతో సరిపెట్టుకున్నారు. ఈ ఎన్నికల్లో హోరాహోరీగా సాగిన పోరులో విజేతగా నిలిచి శాసనసభలోకి అడుగుపెడుతున్నారు.

ముథోల్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన రామారావు పాటిల్ గతంలో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసినా.. ఓటమి పాలయ్యారు. ఈ ఎన్నికల్లో భాజపా నుంచి బరిలో నిలిచి విజేతగా నిలిచారు.

బోథ్ నియోజకవర్గం నుంచి భారాస పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన అనిల్‌జాదవ్ విజయం సాధించడంతో తొలిసారిగా శాసనసభలోకి అడుగుపెడుతున్నారు. ఈయన గతంలో రెండు సార్లు కాంగ్రెస్ పార్టీ నుంచి మరోసారి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినా.. విజయం సాధించలేదు. ఈ ఎన్నికల్లో భారాస నుంచి గెలుపొందారు.

సిర్పూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన పాల్వాయి హరీశ్‌బాబు భాజపా నుంచి గెలుపొందడంతో తొలిసారి శాసనసభలోకి అడుగుపెడుతున్నారు. గతంలో రెండు విడతలుగా పోటీ చేసినా గెలుపొందలేదు. ఈ ఎన్నికల్లో భాజపా నుంచి బరిలో నిలిచి విజయం సాధించారు.

మంచిర్యాల జిల్లా నుంచి గెలుపొందిన ప్రేంసాగర్‌రావు.. అనేక రాజకీయ పదవులు చేపట్టినా తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీకి వెళుతున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి రెండోస్థానంలో నిలిచారు. ఈ ఎన్నికలో ఇదే పార్టీ నుంచి గెలిచి శాసనసభ్యుడిగా అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు.

ఖానాపూర్ నియోజకవర్గం నుంచి గెలిచిన వెడ్మబొజ్జు తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు. ఈయన మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీకి సేవలందించారు. ఇప్పటి వరకు స్థానిక పదవులు సైతం చేపట్టలేదు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నుంచి నిర్వహించిన గిరిజన సభలో వెడ్మబొజ్జుకు టికెట్ ఇస్తున్నట్లు ప్రకటించారు. అనూహ్యంగా టికెట్‌ను దక్కించుకున్న ఈయన ఇక్కడి నుంచి శాసనసభ్యునిగా గెలిచి అసెంబ్లీకి మొదటిసారిగా వెళుతున్నారు. చెన్నూరు నుంచి విజేతగా నిలిచిన వివేక్ గతంలో ఎంపీగా పార్లమెంట్‌కు వెళ్లినా.. శాసనసభ్యుడిగా తొలిసారి అసెంబ్లీలో అడుగుపెడుతున్నారు. ఇక్కడ తొలి రౌండ్ నుంచి వివేక్ ఆధిక్యతను చాటారు

## సత్తుపల్లి తొలి మహిళా ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి : సత్తుపల్లి నియోజకవర్గం తొలి మహిళా ఎమ్మెల్యేగా డాక్టర్ మట్టా రాగమయి నిలిచారు. ఉమ్మడి జిల్లాలోనూ ఏకైక మహిళా ఎమ్మెల్యే తానే కావడం మరో విశేషం. సత్తుపల్లి(వేంసూరు) నియోజకవర్గంలో 1952 నుంచి 2018 వరకు 16 సార్లు ఎన్నికలు జరగ్గా ఏనాడు మహిళలకు అవకాశం దక్కలేదు. తొలి ప్రయత్నంలోనే హాట్రిక్ ఎమ్మెల్యే, భారాస అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్యపై భారీ మెజార్టీతో గెలిచారు. వైద్యురాలిగా సత్తుపల్లి ప్రజలకు ఆమె సుపరిచితులు కావడంతోపాటు తన భర్త డాక్టర్ దయానంద్ కౌన్సిలర్‌గా, అత్త మట్టా ఆరోగ్యం ఎంపీపీగా పని చేయడంతో రాజకీయంగా ఆమెకు కలిసొచ్చింది. వైద్య రంగంలో ఉంటూనే దయానంద్ చేసే సేవా కార్యక్రమాల్లో ఆమె పాలు పంచుకోవడం, ప్రజల్లోనూ సానుభూతి, జనం కూడా మార్పు కోరడం వంటి అంశాలతోపాటు మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరిల అండదండలు కూడా అమె విజయానికి సోపానాలయ్యాయి.



## సెంటిమెంట్ తిరగబడింది..

గజ్వేల్ : ఇక్కడ ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీ అధికారంలోకి వస్తుంది.. ఇది గజ్వేల్‌పై ఇన్నాళ్లు ఉన్న సెంటిమెంట్. ఈ సారి మాత్రం అది తిరగబడింది. ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఇదే సెంటిమెంట్‌ను ప్రచారంలో ఉపయోగించుకుంటూ ప్రజలను ఆకట్టుకునేందుకు యత్నించడం గమనార్హం. ప్రస్తుత ఎన్నికల్లో భారాస అధినేత కేసీఆర్ గజ్వేల్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించినా రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థానాలు దక్కలేదు. తెలంగాణ ఏర్పాడిన అనంతరం గజ్వేల్ నుంచి కేసీఆర్ పోటీ చేస్తున్నారు. 2014, 2018 ఎన్నికల్లో రెండు పర్యాయాలు పోటీ చేసి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఇక ఈ సారి కామారెడ్డి నుంచే పూర్తి స్థాయిలో బరిలోకి దిగేందుకే నిర్ణయించుకున్నా, స్థానిక నేతల కోరిక మేరకు గజ్వేల్, కామారెడ్డిలో పోటీకి దిగారు.

ప్రస్తుత ఎన్నికలతో కలిపి ఇప్పటిదాక ఇక్కడ ఒక ఉప ఎన్నికతో సహా మొత్తం 17 సార్లు ఎన్నికలు జరిగితే 15 ఎన్నికల్లో ఏ పార్టీ గెలిస్తే అదే పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి కొలువుదీరింది. ఈ సెంటిమెంట్‌ను నమ్మి తెలంగాణ ఏర్పాటు తర్వాత తొలిసారి 2014 ఎన్నికల్లో గజ్వేల్‌ను ఎంచుకున్నట్లు స్వయాన కేసీఆరే వెల్లడించారు. 1957 నుంచి ఈ సెంటిమెంట్ ప్రారంభమెది. 1957లో ద్విసభ్య నియోజకర్గంగా ఉన్న గజ్వేల్ నుంచి ఆర్.నర్సింహారెడ్డి, జేబీ ముత్యాలురావు గెలుపొందారు. కాంగ్రెస్‌కు చెందిన నర్సింహారెడ్డి ఎన్నిక చెల్లకపోవడంతో నిర్వహించిన ఉప ఎన్నికల్లో ఆయన తిరిగి విజయం సాధించారు.



అప్పట్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 1962లో కాంగ్రెస్ నాయకుడు సైదయ్య స్వతంత్ర అభ్యర్థిగా గెలిచి కాంగ్రెస్‌లో చేరారు. అప్పుడూ కాంగ్రెసే అధికారంలోకి వచ్చింది. 1978 వరకు నాలుగు సార్లు ఆయనే ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ నాలుగు పర్యాయాలు రాష్ట్రంలో హస్తం పార్టీనే పాలన సాగించింది. 1983లో అల్లం సాయిలు స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించి తెదేపాలో చేరారు. అదే పార్టీ పాలనలోకి వచ్చింది. 1985, 1994, 1999లో ఎన్నికల్లో తెదేపా అభ్యర్థులు విజయం సాధించగా, ఆ పార్టీనే అధికారంలో కొలువుదీరుతూ వచ్చింది. 1989, 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు. ఈ మూడు పర్యాయాలు రాష్ట్రంలో హస్తం పార్టీ అధికారంలోకి వచ్చింది. తెలంగాణ ఏర్పడ్డాక 2014, 2018 ఎన్నికల్లో వరుసగా ఇక్కడి నుంచి కేసీఆర్ పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించి ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో భారాస ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఈ సెంటిమెంట్‌ను అనుకూలంగా మలుచుకునేందుకు అన్ని పార్టీలు గజ్వేల్‌ను ఎంచుకున్నాయి.

**భారాస శ్రేణుల్లో నైరాశ్యం..**

భారాస శ్రేణుల్లో నిరాశ అలుముకుంది. పార్టీ అధినేత కేసీఆర్ గజ్వేల్ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిచినా రాష్ట్రంలో భారాస మ్యాజిక్ సంఖ్యను చేరుకోవడంలో విఫలమైంది. దీంతో ఆ పార్టీ శ్రేణులు తీవ్ర ఆవేదనలో మునిగిపోయారు. రాష్ట్రంలో మూడోసారి అధికారాన్ని చేజిక్కించుకుని పరిపాలన పరంపర సాగుతుందని విశ్వసించిన పార్టీ నేతలు, కార్యకర్తలకు రాష్ట్ర పలితాలు ఖంగుతినేలా చేశాయి.

## నోటాకు ఓటేశారు..!

ఆదిలాబాద్ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నోటాకు ఓటేసిన వారి సంఖ్య ఈ ఎన్నికల్లో కాస్త తగ్గింది. చట్టసభలకు ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడంలో ఓటు హక్కు కీలకమైనది. ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం వంటింది. కానీ.. ఎన్నికల్లో పోటీ చేస్తున్న వారిలో అభ్యర్థులందరూ అందరికీ ఆమోదయోగ్యులై ఉండాలని ఏమీ లేదు. గతంలో నచ్చని అభ్యర్థులు బరిలో ఉన్న చోట్ల ఓటర్లు ఎవరికో ఒకరికి ఓటు వేయడం, మరికొందరు ఓటింగ్‌కు దూరంగా ఉండడం జరిగేది. అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలనే ఉద్దేశంతో ఈవీఎం బ్యాలెట్లలో నోటా(నన్ ఆఫ్ ద ఎబోవ్) బటన్ తీసుకొచ్చారు. ఇది కేవలం ఓటరుకు ఐచ్ఛికం మాత్రమే. అభ్యర్థులు ఎవరూ సరైన వారు లేరని భావించిన పక్షంలో నోటాకు ఓటు వేయవచ్చు. అత్యధికంగా నోటాను వినియోగించుకున్నా పోలైన ఓట్లలో మెజార్టీ ఓట్లు సాధించిన అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. 2014అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది నియోజకవర్గాల్లో 17,095 మంది ఓటర్లు నోటా బటన్ నొక్కారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 20,254 ఓట్లు నోటాకు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో 17,327 మంది నోటాకు ఓటేశారు. బోథ్ నియోజకవర్గంలో అత్యధికంగా నోటాకు వేశారు.

**ఇలా ఈవీఎంల్లోకి..**

2013లో పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ఆధారంగా నోటాను ప్రవేశపెట్టారు. దీన్ని భావ వ్యక్తీకరణలో అంతర్భాగంగానే పరిగణించాలని సుప్రీంకోర్టు పేర్కొంది. తొలిసారిగా ఢిల్లీ, మిజోరాం, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో 2013 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో నోటా ఐచ్ఛికాన్ని ప్రవేశపెట్టారు. అన్ని గుర్తులకంటే చివరలో నోటా గుర్తు ఉంటుంది. ఈ గుర్తును అహ్మదాబాద్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ సంస్థ రూపొందించింది.

**ఎన్నికల్లో నోటాకు పోలైన ఓట్లు**

ఉమ్మడి జిల్లాలో మొత్తంగా 17327

బోథ్ నియోజకవర్గంలో అత్యధికం

**స్వతంత్రుల కన్నా ఎక్కువ**

బోథ్ నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థులు, చిన్న పార్టీల అభ్యర్థులు సాధించిన ఓట్ల కన్నా నోటాకు ఎక్కువ ఓట్లు పోలయ్యాయి. నోటాకు 2565 మంది నోటాను వినియోగించుకున్నారు. బీఎస్పీ అభ్యర్థి జంగుబాపుకు 2044 ఓట్లు, బీసీపీ పార్టీ అభ్యర్థి ఆడె సునీల్ నాయక్‌కు 677, ఆర్‌జేపీ అభ్యర్థి హీరాజీకి 1388, డీఎస్పీ అభ్యర్థి ఉమేష్‌కు 1011, జీజీపీ అభ్యర్థి బాదు నైతంకు 596, స్వతంత్ర అభ్యర్థులు భోజ్యా నాయక్‌కు 878, ధనలక్ష్మికి 1231 ఓట్లు పోల్ అయ్యాయి.

# ఎన్నాళ్లీ బాధలు.. నిత్యం ప్రమాదాలు

ఆలేరు : ఇరుకైన కాజ్‌వేలు.. నిత్యం భారీ వాహనాల రాకపోకలు.. ఆదమరిస్తే ప్రమాదాలు.. ఎందరో క్షతగాత్రులు.. నైజాం కాలంలో నిర్మితమైన ఆలేరు మండలం కొలనుపాకలోని లో-లెవల్ వంతెనల దుస్థితి ఇదీ. ఎట్టకేలకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. అత్యంత ప్రమాదకరంగా ఉన్న ఈ లో లెవల్ కాజ్‌వేకు కనీస మరమ్మతులు చేపట్టకుండా అధికారులు చోద్యం చూస్తున్నారు. ఆలేరు-కొలనుపాక రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. హైదరాబాద్-వరంగల్- భూపాల్‌పట్నం జాతీయ రహదారి 163, రాజీవ్ రహదారిని అనుసంధానంగా ఆలేరు-సిద్దిపేట జిల్లా దుద్దెడ రహదారి ఉంది. ఈ మార్గంలోనే కొలనుపాక గ్రామం ఉంది. ఈ గ్రామంలోని రెండు వాగులు ఈ రహదారి మీదుగానే వెళ్తుంటాయి. రాకపోకలకు ఇబ్బంది కలగకుండా విద్యుత్తు ఉప కేంద్రం సమీపంలోని సుమారు 200 మీటర్ల పొడవున, జైన్ మందిరం సమీపంలో 100 మీటర్ల పొడవున మరో లో లెవల్ కాజ్‌వేను దశాబ్దాల క్రితం నిర్మించారు. ఇప్పుడవి పూర్తిగా శిథిలమయ్యాయి. రాకపోకలకు ఇబ్బందికరంగా మారాయి. సైడ్ వాల్స్ ఏళ్ల కిందటేనే కూలిపోయాయి. వాహనాలు అదుపుతప్పి వాగులో పడుతున్నాయి. లో-లెవల్‌లో కాజ్‌వే ఉండటంతో వర్షాకాలంలో వాగు ఉధృతికి కొన్ని రోజుల పాటు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మూడేళ్లుగా వానలు జోరుగా కురవడంతో వానాకాలం సీజన్‌లో నెలల



తరబడి వాగు ప్రవహిస్తూనే ఉంటుంది. గత నెలలో కురిసిన వర్షాలకు వారం రోజులకు పైగా గ్రామంలో జలదిగ్బంధనంలోనే ఉంది. భారీ వర్షాలు పడిన సమయంలో వాగు ఉప్పొంగి కొలనుపాకకు ఇతర ప్రాంతాల్లో రోజుల తరబడి సంబంధాలు తెగిపోతాయి. వాగులోంచి ఇసుకను తరలించడంతో కాజ్‌వే పొడవునా లోతైన గుంతలు ఏర్పడి రాళ్లు తేలాయి. రోజుల తరబడి వరద నీటి ప్రవాహం కారణంగా నాచుపేరుకుపోయి లారీలు, జీపులు, కార్లు, ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి వాగులో పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. సైడ్‌వాల్స్ లేనికారణంగా నీటి ప్రవాహంతో రోడ్డు తెలియక వాహనాలు కొట్టుకుపోతున్నాయి. ఈ రెండు కాజ్‌వేలు అత్యంత ప్రమాదకరంగా మారాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. వర్షాలకు వాగులు పొంగిపొర్లడంతో రవాణా వ్యవస్థ స్తంభిస్తున్నందున వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉంది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తొలగిపోవడంతోపాటు స్థానిక ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. ఎమ్మెల్యే గొంగిడి సునీత చొరవతో కొన్ని నెలల కిందట ఎట్టకేలకు రూ. 4.85 కోట్లు మంజూరయ్యాయి. అయినా ఆర్‌అండ్‌బీ అధికారులు పనులు ప్రారంభించడం లేదు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం:గొంగిడి సునీత, ఎమ్మెల్యే, ఆలేరు.

కొలనుపాక సబ్‌స్టేషన్ సమీపంలోని పెద్ద వాగుపై వంతెన నిర్మాణానికి రూ. 4.85 కోట్లు మంజూరు చేయించాను. టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయ్యింది. గుత్తేదారు నిర్మాణ స్థలాన్ని సందర్శించారు. వర్షాల వల్ల పనులు ప్రారంభించడంలో కొంత జాప్యం జరిగింది. నీటి ప్రవాహంతో పనులు చేపట్టలేకపోయాం. త్వరలో పనులు ప్రారంభిస్తాం.

# ఇళ్ల మధ్య గ్యాస్ దందా

జిన్నారం: పారిశ్రామిక ప్రాంతమైన జిన్నారం మండలం ఐడీఏ బొల్లారంలో ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు తాత్కాలికంగా నివాసం ఉంటున్నారు. కొన్ని నెలలపాటు ఇక్కడ పనిచేసి.. ఒప్పందం ముగిసిన తర్వాత వారి ప్రాంతాలకు వెళుతుంటారు. ఇలాంటి వారు వంట కోసం చిన్న గ్యాస్ సిలిండర్లు కొనుగోలు చేస్తుంటారు. వారికి రీఫిల్లింగ్ కోసం కొన్ని దుకాణాల యజమానులు రాయితీ సిలిండర్లను వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో ఇళ్ల మధ్యనే గ్యాస్ నింపుతూ.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్న తీరుపై కథనం.

కొన్ని ఘటనలు గత నెలలో ఐడీఏ బొల్లారం పట్టణంలోని పాత బస్తీలో గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పెద్దాసుపత్రికి వెళితే ఈ ఘటన వెలుగులోకి వస్తుందని.. స్థానిక



ఆర్ఎంపీతో వైద్యం చేయించారు. అక్కడ సరైన వైద్యం అందక ఓ బాలుడి కాలు తీసేయాల్సి వచ్చింది. ఆ తరువాత బాధిత కుటుంబాన్ని వారి సొంత రాష్ట్రమైన బిహార్‌కు పంపించారు.

బాలాజీనగర్‌లో ఓ ఇంట్లో రీఫిల్లింగ్ చేస్తుండగా వంట గ్యాస్ వాసన వస్తుందని స్థానికులు ఆందోళన చేశారు. ఇప్పటికీ అక్కడ దందా యథేచ్ఛగా సాగుతోంది. వారం రోజుల క్రితం ఇలాంటి కేంద్రాలపై అధికారులు దాడులు చేశారు. నాలుగు కేంద్రాల నుంచి పదుల సంఖ్యలో రాయితీ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత కొందరు స్థానిక నేతలు బేరం కుదిర్చి చర్యలు తీసుకోకుండా చేశారనే ఆరోపణలున్నాయి.కఠిన చర్యలు తప్పవుగత వారం ఐడీఏ బొల్లారం పరిధిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాం. రీ ఫిల్లింగ్ నిర్వాహకులను గుర్తించి హెచ్చరించాం. మళ్లీ ఇలాంటి దందా చేయబోమని వారు చెప్పారు. అనుమతి లేకుండా ఏ వ్యాపారం చేసినా నేరమే అవుతుంది. నిరంతర నిఘాతో గ్యాస్ దందాకు అడ్డుకట్ట వేస్తాం.సుజాత, ఉప తహసీల్దార్, పౌరసరఫరాల విభాగం.

# కూడళ్లపైనే అందరి దృష్టి



పెద్దపల్లి : కూడళ్లను సుందరీకరణ చేయాలని పురపాలిక అధికారులు ప్రయత్నిస్తుండగా, నాయకుల విగ్రహాలు ఎక్కడ పెట్టాలనే అంశాలపై ఆయా పార్టీలు, సంఘాల నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. పట్టణంలోని వివిధ కూడళ్ల సుందరీకరణ కోసం గతంలోనే పురపాలిక అధికారులు కొన్ని కూడళ్ల పనులు చేపట్టారు. ఈసారి మరికొన్ని కూడళ్ల సుందరీకరణకు కార్యాచరణ చేపడుతున్నారు. నేతల విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు సంఘాలు, సంస్థలు పోటీలు పడుతుండటం చర్చనీయాంశమవుతోంది.

కొత్త సొబగులు

పెద్దపల్లిలో ప్రగతినగర్‌లోని పాత కోర్టు కూడలి, శంకర్‌గంజ్‌లోని చాకలి ఐలమ్మ కూడళ్లను సుందరీకరించేందుకు పురపాలిక అధికారులు కార్యాచరణ చేపట్టారు. రూ. 50 కోట్లతో ఈ రెండు కూడళ్లను విస్తరించి, సుందరంగా మార్చనున్నారు. రెండు ప్రాంతాల్లో కూడ కొద్ది మార్పులతో గ్లోబ్ మాదిరి వాటర్ ఫౌంటేన్, అందమైన లైటింగ్ ఏర్పాటు చేసేందుకు డిజైన్ ఆమోదించారు. కానీ గతంలో జెండా కూడలిలో కూడలి విస్తరణ చేపట్టిన అధికారులు, సుందరీకరణ పనులు మాత్రం నిర్వహించలేదు. సుభాష్ విగ్రహం కూడలిని అభివృద్ధి చేసి, విగ్రహాన్ని కూడలి మధ్యలో ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన సాకారం కాలేదు. దీంతో విగ్రహం ఏర్పాటు చేసిన ప్రాంతంలోనే ఒక వాటర్ ఫౌంటేన్ ఏర్పాటు చేశారు. శాంతినగర్ కూడలిలోనూ రోడ్డు పక్కన హన్‌మాన్ విగ్రహం వద్ద మరో ఫౌంటేన్ ఏర్పాటు చేశారు. ఈరెండు ఫౌంటేన్‌ల నిర్వహణ సైతం మున్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించిన రెండు కూడళ్లలో పనులు ఏ మేరకు ముందుకు సాగుతాయో పాలకమండలి కార్యదక్షతపైనే ఆధారపడి ఉంది.

విగ్రహాల కోసం పోటీ

జిల్లా కేంద్రంలో రహదారులను విస్తరించి, విభాగిణిలను ఏర్పాటు చేయడంతో రాజకీయ పార్టీల నాయకులు విగ్రహాల ఏర్పాటుపై ఆలోచనలు మొదలయ్యాయి. కూడళ్లు, రహదారులపై నేతల విగ్రహాలు ఏర్పాటు చేయొద్దని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు ఎక్కడా అమలు కావడం లేదు. అంతటా అనధికారికంగా విగ్రహాల ఏర్పాటు జరగుతుండడం, పెద్దపల్లిలో ఇటీవల మరీఎక్కువ కావడంతో విగ్రహాల ఏర్పాటు కోసం నాయకుల మధ్య పోటీ పెరిగింది. ఇటీవల కమాన్ కూడలి నుంచి సుభాష్ విగ్రహం వరకు రహదారి విస్తరించి, రోడ్డు మధ్య విభాగిణి ఏర్పాటు చేశారు. కమాన్ కూడలి సమీపంలోని విభాగిణి ఆరంభమయ్యే ప్రాంతంలో స్పీకర్ శ్రీపాదరావు విగ్రహం ఏర్పాటు కోసం యువజన కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. ఈ విషయం తెలియని విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు ఆచార్య జయశంకర్ విగ్రహం ఏర్పాటు కోసం మరోసారి పూజ చేయడంతో వివాదం ఏర్పడింది. ఈ రోడ్డులోని విభాగిణి ముగిసే ప్రాంతంలో విగ్రహం పేరు చెప్పకుండానే యాదవ సంఘం నాయకులు బీపీ మండల్ జయంతి వేడుకలు నిర్వహించారు. గతంలో ప్రగతి నగర్ కూడలిలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు కొందరు నాయకులు చేసిన ప్రయత్నాలను పోలీసులు అడ్డుకున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలోని పాతకోర్టు నుంచి అమర్‌నగర్‌వైపు డివైడర్‌కు జ్యోతిబాపులే, ప్రగతినగర్ వద్ద ఎన్టీఆర్, రైల్వేస్టేషర్ రోడ్డులో బస్టాండ్ వద్ద జగ్జీవన్ రాం, కూనారం రోడ్డులో ఎమ్మెల్యే ముకుందరెడ్డి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ నాలుగు డివైడర్లను ఆనుకొని ఏర్పాటు చేయగా, జెండా కూడలిలో ఒక వైపు ఇప్పటికే రాజీవ్‌గాంధీ విగ్రహం ఉంది. ఇటీవల మరోవైపు కాన్షీరాం విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమం లోనే విగ్రహాల ఏర్పాటుకు నేతల పోటీ పడడం అనివార్యమవుతుంది.

# వానర ఆహార వనాలు కనుమరుగు!



తంగళ్లపల్లి : గ్రామాల్లోకి కోతులు గుంపుగా వచ్చి పడుతున్నాయి. ఇళ్లు గుల్ల చేస్తున్నాయి. వాటి నుంచి రక్షించాలని జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు మొరపెట్టుకుంటున్నారు. ఊర్లో నుంచి కోతులను అడవులకు పంపించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రజలు విన్నవిస్తూనే ఉన్నారు. దీంతో అవి గ్రామాల నుంచి తిరిగి అడవులకు వెళ్లేందుకు వానర వనాలు (మంకీఫుడ్ కోర్టులు) ఏర్పాటు చేశారు. అధికారులు చేసిన ప్రయత్నాలు మొదట్లో ఫలితాలు ఇచ్చినా, ప్రస్తుతం ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం, పండ్ల చెట్లు లేక మళ్లీ పట్టణాలు, పల్లెల బాట పట్టి ఇక్కడే తిష్ఠ వేస్తున్నాయి. జిల్లాలో అయిదేళ్ల కిందట వానర వనాలు ఏర్పాటు చేశారు. ముస్తాబాద్, తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల్లో 12 వానర వనాలను అధికారులు ఏర్పాటు చేశారు. వీటిలో 87,500 పండ్ల మొక్కలను పెంచారు. త్వరగా పెరిగే వాటిని నాటారు. ఏడాదిలోపే బొప్పాయి, జామ పండ్లు కాసి కోతకు వచ్చాయి. వీటితోపాటు మునగ, సీతాఫలాలు, ఉసిరి తదితర పండ్ల మొక్కలను పెంచారు. సిరిసిల్ల మానేరు తీరాన సుమారు ఏడు ఎకరాల్లో 14 రకాలకు చెందిన రెండు వేల పండ్ల మొక్కలను పెంచారు. ఇటీవల కురిసిన వర్షాలకు కస్బెకట్కూర్, ముస్తాబాద్ మండలం ఆవునూర్, రామలక్ష్మణపల్లె, తుర్కపల్లి, కొండాపూర్, గండిలచ్చపేట, మండెపల్లి గ్రామాల శివారులోని మానేరు వాగులో వనాలు కొట్టుకుపోయాయి. తంగళ్లపల్లి మండలంలోని మండెపల్లి, తంగళ్లపల్లి గ్రామాల శివారులోని మానేరు వాగు ఒడ్డున పెట్టిన వనాలు ఆనవాళ్లు లేకుండా పోయాయి. మిగతా చోట్ల నిర్వహణ లేక మొక్కలు ఎండిపోవడం, ఫెన్సింగ్ లేకపోవడంతో పశువులు తినేశాయి. ఫలితంగా వానర వనాలు కొన్నిచోట్ల కనుమరుగయ్యాయి. ఉన్నవాటినైనా రక్షించినట్లయితే కోతులకు ఉపయోగపడే అవకాశం ఉంది. అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

జిల్లాలో 15 దశాబ్ది సంపద వనాలు

మానేరు వాగుకు ఆనుకొని ఉన్న కొన్ని వనాలు కాయలు కాసే సమయానికి వర్షాలకు కొట్టుకుపోయాయి. మిగిలిన కొన్ని చెట్లు బాగానే ఉన్నాయి. వాటిని రక్షించడంతోపాటు 9వ విడత హరితహారం కార్యక్రమంలో జిల్లాలో 24 ఎకరాల్లో 15 దశాబ్ది సంపద వనాలు ఏర్పాటు చేస్తున్నాం. బోయినపల్లి మండలంలో 10, నర్మాలలో 5 ఏర్పాటు చేశాం. వాటిలో ఇప్పటికే 11,700 మొక్కలు నాటించాం. మదన్‌మోహన్, అదనపు డీఆర్‌డీవో

# ప్రభుత్వ, పరిశ్రమ భూముల్లో ఆక్రమణలు



గోదావరిఖని: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో విలువైన భూములు ఆక్రమార్కుల చేతుల్లో వెళ్తున్నాయి. ప్రభుత్వ భూములతో పాటు పరిశ్రమల ఏర్పాటు కోసం సేకరించిన స్థలాలకు హద్దుల ఏర్పాటు లేకపోవడంతో పాటు పట్టామార్పిడి చేసుకోకపోవడాన్ని కబ్జాదారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. విలువైన భూములను సొంతం చేసుకునేందుకు పావులు కదుపుతున్నారు. రామగుండం ప్రాంతంలో పేదల అవసరాల కోసం ప్రభుత్వం సేకరించిన భూమిని కొందరు దళారులు దర్జాగా కబ్జా చేస్తూ విక్రయించుకుంటున్నారు. రహదారి కోసం సింగరేణి సంస్థ సేకరించిన భూమిని దక్కించుకోవడానికి రహదారి వెడల్పును తగ్గించి మరీ మిగతా భూమిని ఆక్రమించుకుంటున్నారు. పేదప్రజల ఇళ్ల కోసం ప్రభుత్వం సేకరించిన 100 ఎకరాల భూమిలో సైతం పాగా వేస్తున్నారు. ఇప్పటికే అనేక ప్లాట్లను విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొందరు అందులో రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు హద్దులు సైతం ఏర్పాటు చేసుకున్నారు. రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా వారి దందాకు అడ్డుకట్ట పడటం లేదు. తాజాగా సింగరేణి సంస్థ రహదారి కోసం సేకరించిన భూమిని కూడా దక్కించుకోవడానికి కొందరు వ్యూహాలు పన్నుతున్నారు.

పేదల ఇళ్లకోసం సేకరిస్తే...

ప్రభుత్వం పేద ప్రజల ఇళ్ల కోసం మేడిపల్లి శివారులో 100 ఎకరాల భూమిని సేకరించింది. ఒక ఎకరాకు రూ. 5 లక్షల చొప్పున చెల్లించిన ప్రభుత్వం వంద ఎకరాలు సేకరించి న్యూ పీకే రామయ్యకాలనీ, ఇందిరమ్మకాలనీల్లో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించింది. ప్రస్తుతం అందులో 15 ఎకరాలు ఖాళీగా ఉండటంతో అక్రమార్కులు దానిపై కన్నేశారు. అందులో ఇళ్ల నిర్మాణాలకు స్థలాలను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మేడిపల్లి శివారులోని 17 సర్వే నెంబర్ల నుంచి వంద ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. ఒక సర్వే నెంబరులో ఉన్న తప్పును కొంతమంది అనుకూలంగా మలుచుకుని సొంతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొన్ని ప్లాట్లను విక్రయించిన దళారులు తమ దందాను కొనసాగిస్తున్నారు.రెవెన్యూ అధికారులు కూల్చివేసినా కొద్ది రోజులు దందాను నిలిపివేసి మళ్లీ మొదలు పెడుతున్నారు. దీంతో విలువైన ప్రభుత్వ భూములు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్తున్నాయి.

రహదారి పక్కన...సింగరేణి సంస్థ రహదారి కోసం సేకరించిన భూమిని సైతం అక్రమార్కులు వదలడం లేదు. వంద ఫీట్ల రహదారి నిర్మాణం కోసం సింగరేణి సంస్థ 13.12 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసింది. దీనికి సంబంధించి సేకరించిన భూమికి పరిహారం చెల్లించింది. పట్టా మార్పిడి చేసుకోకపోవడంతో ఆ స్థలంపై కబ్జాదారుల కన్ను పడింది. మేడిపల్లి నుంచి రామగుండం వెళ్లేందుకు ఏర్పాటు చేసే లింకు రోడ్డును 30 ఫీట్లకు కుదించి మిగతా స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారు. ఎంతో విలువైన భూమిని అక్రమార్కులు తమ చేతుల్లోకి తీసుకుంటున్నారు. సింగరేణి విస్తరణ కోసం గతంలో సేకరించిన భూముల్లో సైతం అక్రమ దందా కొనసాగుతున్నట్లు సమాచారం. ఓసీపీ-5 కోసం సేకరిస్తున్న భూమిలో కూడా గతంలో సంస్థ పరిహారం చెల్లించిన భూములకే మళ్లీ చెల్లించే పరిస్థితి ఏర్పడింది. జనగామ, సుందిళ్ల, ముస్త్యాల గ్రామాల పరిసర ప్రాంతాల్లో భూమి రికార్డులు లేకపోవడంతో మళ్లీ వాటికే పరిహారం చెల్లించే పరిస్థితి. భూసేకరణ సమయంలో పట్టా మార్పిడి చేసుకోకపోవడంతో సంస్థ భూములకు రక్షణ లేకుండా పోతుందని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా ఆయా అంశాలపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

# అధిక దిగుబడికి నాలుగు పద్ధతులు!

వరంగల్ : వానాకాలం సాగుకు సంబంధించి రైతులు మంచి దిగుబడి సాధించేందుకు వ్యవసాయశాఖ నాలుగు విధానాలు మేలన్న నినాదంతో ముందుకు వెళ్లనుంది. అన్నదాతలు నాలుగు విధానాలు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చని దీంతో భూసార పరిరక్షణతో పాటు పలు ప్రయోజనాలు ఉంటాయని ప్రచారం చేస్తోంది. క్షేత్ర సందర్శనలో.. ప్రయోజనం పొందుతున్న రైతుల అభిప్రాయాలను ఇతర రైతులకు చెప్పించి బహుళ ప్రచారం చేయాలని సంకల్పించింది. నాలుగు విధానాల వివరాలివి..

వెదజల్లే పద్ధతి

వరి సాగు విషయంలో నారుమడులు తయారు చేయడం, నారు పెంచడం, నాట్లు, కలుపుమొక్కల తొలగింపు తదితర పనులకు కూలీలు అధికంగా కావాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో వీరి కూలీల కొరత ఎక్కువగా ఉంది. దీంతో వీరికి కూలీ చెల్లించడం కూడా రైతులకు తలకు మించిన భారంగా మారుతోంది. దీన్ని నివారించేందుకు రైతులు వెదజల్లే పద్ధతిలో పంటలు సాగు చేయాలని సూచిస్తున్నారు. దీంతో సమయం, డబ్బు మిగులుతాయని, రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుందని, ప్రతి మొక్క ఎదగడానికి అవకాశం ఉంటుందని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. నిరుడు వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన రైతులతో మాట్లాడిస్తున్నారు.

భాస్వరం కరిగించే ప్రక్రియ

రైతులు పొలాల్లో వాడే ఎరువుల్లో మోతాదుకు మించిన భాస్వరం కలిసి ఉంటుంది. దీంతో భాస్వరం నిల్వలు పొలంలో పేరుకుపోయి పంట దిగుబడిపై అధిక ప్రభావం చూపుతుంది. రెండేళ్ల నుంచి పొలాల్లో భాస్వరం కరిగించే గుళికలను ప్రభుత్వం అందించింది. మొదటి ఏడాది ఎంపిక చేసిన రైతులకు ఉచితంగా అందించిన ప్రభుత్వం.. అనంతరం ఉపసంహరించుకుంది. ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉన్న గుళికలను వినియోగించుకొని పొలాల్లో పేరుకుపోయిన భాస్వరం నిల్వలను తగ్గించుకోవాలని ప్రచారం చేస్తోంది. రెండు మూడేళ్లుగా ఈ ప్రయోగం చేసిన రైతులతో మాట్లాడించే ప్రయత్నాలు చేస్తోంది. ప్రతి క్లస్టర్‌కు కనీసం 200 ఎకరాల్లో భాస్వరాన్ని కరిగించే ప్రయత్నాలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది.

పచ్చిరొట్ట ఎరువు..

ఏటా వానాకాలం సాగుకు ముందే ప్రభుత్వం పచ్చిరొట్ట ఎరువును తగ్గింపు ధరలకు అందిస్తుంది. మునుపటిలా పెంటమట్టి అందించకపోవడం, గొర్రెల మందలను పెట్టించకపోవడంతో పొల్లాలో సారం పెరగడం లేదని, ఉన్నసారాన్ని అధిక మోతాదులో ఎరువులు వాడి పొలాలను నిర్వీర్యం చేస్తున్నారని వ్యవసాయ శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. దీనికి విరుగుడుగా జీలుగ, పిల్లిపెసర తదితర పచ్చిరొట్ట ఎరువులకు సంబంధించిన మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యమిస్తున్న వ్యవసాయశాఖ తాజాగా.. పచ్చిరొట్ట పెంపకం చేపట్టిన రైతుల క్షేత్ర సందర్శనలకు ఏర్పాట్లు చేస్తోంది. వ్యవసాయ విస్తరణాధికారులు పచ్చిరొట్ట ఎరువుల క్షేత్రాలకు సమీపంలోని రైతులను తీసుకెళ్లి చూపిస్తున్నారు.

ఎరువుల వాడకం..

పనిభారాన్ని తగ్గించుకునేందుకు రైతులు ఒకేసారి ఎరువులను వెదజల్లుతుంటారు. ఇది సమర్థనీయమైన విధానం కాదని నిపుణులు సూచిస్తుండడంతో వ్యవసాయాధికారులు రైతులను చైతన్యపర్చాలని నిర్ణయించారు. ఎరువులు వాడాల్సి వచ్చినప్పుడు ఒకేసారి కాకుండా మూడు విడతల్లో వినియోగించాలని సూచిస్తున్నారు. రైతులకు కొద్దిగా భారమే అయినా ఎరువులోని ప్రతి గుళికా పూర్తిస్థాయిలో మొక్కకు చేరుతుందని, వృథా తగ్గుతుందని ప్రయోగాత్మకంగా వివరిస్తున్నారు. ఈ విధానాన్ని అనుసరించే రైతుల వివరాలను అధికారులు సేకరించనున్నారు.

వ్యవసాయం భారం కాకూడదనే..- వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి

రైతులకు కూలీల కొరత సమస్యను తగ్గించి పంట దిగుబడి పెంచేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఇందులో భాగంగానే ఈ నాలుగు విధానాలపై బహుళ ప్రచారం చేస్తున్నాం. జనగామ జిల్లాలోని 64 మంది వ్యవసాయ విస్తరణాధికారులు అనుసంధానించిన క్లస్టర్ గ్రామాలను తరచూ సందర్శించడంతో పాటు పదిమంది రైతులు కూర్చున్న చోట ఈ విషయాలు వివరిస్తున్నారు. వానాకాలంలో జిల్లాలో 1,90,000 ఎకరాల్లో వరి సాగవుతుందని అంచనా వేశాం.

# పెసర అధరహో

సూర్యాపేట : పేట వ్యవసాయ మార్కెట్‌లో పెసలు ధరహాసం చేస్తున్నాయి. ఇప్పుడిప్పుడే పంట చేతికిరావడం.. మార్కెట్‌కు అడపా దడపా వస్తున్నా.. అధిక ధర పలుకుతోంది. మరో 20 రోజులైతే పూర్తిస్థాయిలో పంట చేతికిరానుంది. ముందుగా సాగు చేసిన రైతులు ఈలోపు పంటను విక్రయిస్తున్నారు. మార్కెట్‌కు సోమవారం అన్నదాతలు 31 బస్తాలు(5 క్వింటాలు) తీసుకొచ్చారు. నాణ్యతను పరిశీలించిన అధికారులు గరిష్ఠ ధర రూ. 8,729 నిర్ణయించారు. జిల్లాల్లో పండించిన పెసళ్లను ఒడిశా, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ఎక్కువగా ఎగుమతి చేస్తుంటారు. అక్కడ డిమాండ్ ఉండడంతో పంట కూడా సాగు లేక పప్పు కొరత ఏర్పడుతోంది. జిల్లా నుంచి ఏటా ఈ సీజన్‌లో పెసళ్లను ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు.

పోటీపడి కొనుగోళ్లు.. అక్కడి కొరతను బట్టి మార్కెట్‌లో ట్రేడర్లు



పోటీపడి పెసళ్లను కొనుగోలు చేస్తున్నారు. మొత్తం 72 మంది ట్రేడర్లు ఉండగా 16 మంది మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో కూడా పెసర సాగును ఎక్కువగా చేపట్టడం లేదు. దీనిని అంతర పంటగానే భావించి రైతులు రెండెకరాలలోపు మాత్రమే సాగు చేస్తున్నారు. ఎక్కువగా మిర్చి, పత్తి పంటలపై మొగ్గు చూపుతున్నారు.

ఇతర రాష్ట్రాల్లో డిమాండ్- ఫసియొద్దీన్, మార్కెట్ కార్యదర్శి, సూర్యాపేటఇతర రాష్ట్రాల్లో పెసళ్లకు డిమాండ్ ఉండటంతో అధిక ధర పలుకుతోంది. అక్కడ ఎక్కువగా పప్పు వినియోగిస్తారు. అన్నదాతలు కూడా మార్కెట్‌కు నాణ్యమైన ఉత్పత్తులు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలి.




దిల్లీ: వ్యవస్థీకృత అక్రమ పెట్టుబడులు, టాస్క్-ఆధారిత పార్ట్‌టైం జాబ్ మోసాలను అరికట్టేందుకు కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ తరహా మోసాలకు కారణమవుతున్న వెబ్‌సైట్లపై కొరఢా ఝుళిపించింది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సిఫార్సుల మేరకు దాదాపు 100కు పైగా వెబ్‌సైట్లను కేంద్ర ఐటీ శాఖ బ్లాక్ చేసింది. ఈ మేరకు బుధవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. వ్యవస్థీకృతంగా మోసపూరిత పెట్టుబడులు, పార్ట్‌టైం ఉద్యోగాల పేరుతో జరుగుతున్న ఆన్‌లైన్ నేరాలపై కేంద్ర హోం శాఖకు చెందిన ఇండియన్ సైబర్‌క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ విభాగం ఇటీవల పరిశీలన చేపట్టింది. ఇందులో భాగంగానే ఈ తరహా మోసాలు జరుగుతున్న కొన్ని వెబ్‌సైట్లను గుర్తించి.. వాటిని తక్షణమే బ్లాక్ చేయాలని ఐటీ శాఖకు సిఫార్సు చేసింది. ఈ క్రమంలోనే కేంద్ర ఐటీ శాఖ తమ ప్రత్యేక అధికారాలతో 100కి పైగా వెబ్‌సైట్లపై నిషేధం విధించింది. ఆర్థిక నేరాలను ప్రోత్సహిస్తున్న ఈ వెబ్‌సైట్లను విదేశీ వ్యక్తులు నిర్వహిస్తున్నట్లు ఐటీశాఖ తమ ప్రకటనలో వెల్లడించింది. డిజిటల్ ప్రకటనలు, చాట్ మెసెంజర్స్, రెంటెడ్ అకౌంట్లను వినియోగించి వీరు తమ కార్యకలాపాలను సాగిస్తున్నట్లు తెలిపింది. ఇలా ఆర్థిక మోసాల నుంచి వచ్చిన సొమ్మును క్రిప్టో కరెన్సీలు, విదేశీ ఏటీఎం కార్డులు, ఇంటర్నేషనల్ ఫిన్‌టెక్ కంపెనీల సాయంతో మనీలాండరింగ్ చేస్తున్నారని తాము గుర్తించినట్లు ఐటీశాఖ పేర్కొంది. అయితే, ఈ వెబ్‌సైట్ల వివరాలను కేంద్రం వెల్లడించలేదు.

**'ఇంట్లోనే కూర్చుని సంపాదన' అంటే నమ్మొద్దు..** ఈ సందర్భంగా పార్ట్‌టైం జాబ్ మోసాలపై కేంద్రం హెచ్చరికలు చేసింది. 'ఇంట్లోనే కూర్చుని సంపాదన' వంటి ప్రకటనలతో సైబర్ నేరగాళ్లు యూజర్లను ఆకట్టుకుంటారని పేర్కొంది. రిటైర్డ్ ఉద్యోగులు, మహిళలు, నిరుద్యోగులను ఎక్కువగా టార్గెట్ చేస్తారని తెలిపింది. "అలాంటి యాడ్స్ క్లిక్ చేయగానే.. వారి ఏజెంట్లు వాట్సప్, టెలిగ్రామ్ వంటి మాధ్యమాల్లో యూజర్లతో మాట్లాడుతారు. వీడియోలు లైక్ చేయడం, సబ్‌స్క్రైబ్ చేయడం, రేటింగ్ ఇవ్వడం వంటి టాస్కులు చేసి ఇంట్లోనే కూర్చుని డబ్బు సంపాదించొచ్చు అంటూ యూజర్లను వలలో వేసుకుంటారు. తొలుత కొంత కమిషన్ ఇచ్చి.. ఆ తర్వాత లాభాల ఆశజూపి పెట్టుబడి మోసాలకు పాల్పడుతారు" అని కేంద్రం తెలిపింది. ఇలాంటి మోసాల పట్ల యూజర్లు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. తెలియని వ్యక్తులతో ఆర్థిక లావాదేవీలు చేయొద్దని సూచించింది. ఇటీవల మహాదేవ్ బెట్టింగ్ యాప్ వివాదం నేపథ్యంలో అక్రమంగా బెట్టింగ్‌కు పాల్పడే 22 యాప్‌లు, వెబ్‌సైట్లపై కేంద్రం నిషేధం విధించిన విషయం తెలిసిందే. వాటిలో మహదేవ్, రెడ్డీఅన్నప్రెస్టోప్రో వంటి యాప్‌లు ఉన్నాయి.




ఛత్తీస్‌గఢ్‌లో రాజకీయంగా పెను సంచలనం సృష్టించిన మహదేవ్ బెట్టింగ్ యాప్ కుంభకోణంలో కీలక నిందితుడి తండ్రి అనుమానాస్పద స్థితిలో మరణించాడు. రాష్ట్రంలోని దుర్గ్ జిల్లాలోని అచ్చోటి గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకొంది. మహదేవ్ యాప్ కుంభకోణంలో అసిమ్ దాస్ కీలక నిందితుడు. అతడి త్రండి సుశీల్‌దాస్ (62) ఆచూకీ గత రెండు రోజులుగా తెలియడం లేదు. అతడి మృతదేహాన్ని మంగళవారం స్వగ్రామంలోని ఓ బావిలో గుర్తించారు.

**కొన్ని విషయాలపై మౌనమే ఉత్తమం :** జిల్లా సీనియర్ ఎస్పీ రామ్‌గోపాల్ గర్గ్ ఈ ఘటనపై మాట్లాడుతూ.. సుశీల్ దాస్ ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానిస్తున్నామని పేర్కొన్నారు. మృతికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. మృతుడు ఓ ప్రైవేటు కంపెనీలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. మృతుడు సుశీల్‌దాస్ కుమారుడు అసిమ్ దాస్(కొరియర్), కానిస్టేబుల్ భీమ్ సింగ్‌ను మహదేవ్ బెట్టింగ్ యాప్ కుంభకోణంలో నవంబర్ 3వ తేదీన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసింది. ఈ బెట్టింగ్ యాప్ ప్రమోటర్లు ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బఘేల్‌కు రూ.508 కోట్ల మేర ఇచ్చినట్లు ఈడీ ఆరోపించింది. ఈ కేసులో అరెస్టయిన కొరియర్ తొలుత తన వాంగ్మూలంలో ఈ విషయాన్ని చెప్పినట్లు దర్యాప్తు సంస్థ పేర్కొంది. అయితే, తర్వాత కొరియర్ మాట మార్చాడు.

ఎన్నికలకు ముందు ఈ కేసు రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం లేపింది. ఈ యాప్ ప్రమోటర్లలో ఒకరైన సౌరభ్ చంద్రకర్ వివాహం ఈ ఏడాది ఫిబ్రవరిలో యూఏఈలో జరిగింది. ఇందుకోసం రూ.200 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిసింది. బాలీవుడ్ సెలబ్రిటీలను దీనికి ఆహ్వానించినట్లు ఈడీ గుర్తించింది.




దిల్లీ: ఇటీవల కాలంలో వయసుతో సంబంధం లేకుండా సంభవిస్తోన్న గుండెపోటు మరణాలు తీవ్ర కలవరం సృష్టిస్తున్నాయి. కొద్దిరోజుల క్రితం గుజరాత్‌లో దసరా పండగ సందర్భంగా గర్బా నృత్యం చేస్తూ పలువురు మృతి చెందడం ఆందోళన కలిగించింది. ఈ అనూహ్య మరణాలను తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. దేశవ్యాప్తంగా సీపీఆర్ టెక్నిక్‌లో శిక్షణ ఇచ్చేందుకు బుధవారం కేంద్ర ఆరోగ్య శాఖ ఒక కార్యక్రమాన్ని ప్రారంభించింది. కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ఈ రోజు(డిసెంబర్ 6) ఈ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఇది దేశవ్యాప్తంగా అమలుకానుంది. ఈ కార్యక్రమంలో భాగంగా సుమారు 10 లక్షల మందికి సీపీఆర్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. గుర్తింపు పొందిన వెయ్యికి పైగా వైద్యకేంద్రాల ద్వారా ఈ శిక్షణ అందుతుంది. జిమ్‌లో పనిచేసేవారూ ఈ శిక్షణలో భాగమవుతారు. అధికారిక గణాంకాల ప్రకారం.. 2021 నుంచి 2022 మధ్య ఈ మరణాలు 12.5 శాతం పెరిగాయి.

ఈ గుండెపోటు మరణాల గురించి ఇదివరకు మాండవీయ మాట్లాడుతూ.. కొవిడ్-19 కారణంగా తీవ్ర అనారోగ్యానికి గురై కోలుకున్నవారు తర్వాత ఒకటి నుంచి రెండేళ్లపాటు ఎక్కువగా శ్రమించకపోవడం మంచిదని తెలిపారు. ఈ మేరకు ఆయన భారత వైద్య పరిశోధన మండలి అధ్యయనాన్ని ఉదహరించారు.

**'గుండె' జర భద్రం! :** ఇదిలా ఉంటే.. గుజరాత్‌లో గడిచిన ఆరు నెలల్లో గుండెపోటు కారణంగా 1052 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అక్కడి ప్రభుత్వం వెల్లడించిన సంగతి తెలిసిందే. వారిలో 80 శాతం మంది 11-25 ఏళ్ల మధ్య వయసువారే. ఇలా గుండెపోటు ఘటనలు పెరుగుతోన్న నేపథ్యంలో సీపీఆర్‌పై దాదాపు 2లక్షల మంది టీచర్లు, కాలేజీ ప్రొఫెసర్లకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపింది.

## విశాఖకు కార్యాలయాలను తరలించడంపై జీవో.. హైకోర్టులో విచారణ

అమరావతి: విశాఖలో కార్యాలయాల ఏర్పాటుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) శ్రీరామ్ వాదనలు వినిపించారు. "ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) వేయాల్సిన అంశాన్ని రిట్ పిటిషన్‌గా దాఖలు చేశారు. అందువల్ల పిటిషన్‌కు విచారణ అర్హత లేదు. ఇది ఫోరమ్ షాపింగ్ కిందకు వస్తుంది" అని ఏజీ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. మరోవైపు జీవోల అమలు నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్లు న్యాయస్థానాన్ని కోరారు.

ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషన్‌పై తదుపరి విచారణను డిసెంబర్ 8వ తేదీకి వాయిదా వేసింది.






దిల్లీ: జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేసి అక్కడ అసెంబ్లీని ఏర్పాటు చేసేందుకు కేంద్రం చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలోనే 'జమ్మూ-కశ్మీర్ రిజర్వేషన్ (సవరణ) బిల్లు-2023', 'జమ్మూ-కశ్మీర్ రీఆర్గనైజేషన్ (సవరణ) బిల్లు-2023'ను కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టగా.. వాటికి దిగువసభ బుధవారం ఆమోదం తెలిపింది. ఈ బిల్లుల్లో పునర్విభజన తర్వాత శాసనసభ నియోజక వర్గాల సంఖ్య ఎలా ఉండనుంది? రిజర్వేషన్ల అమలు ఎలా? వంటి అంశాలను పొందుపర్చారు. వీటిపై లోక్‌సభలో రెండు రోజుల పాటు చర్చ చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. బిల్లులోని కీలక అంశాలను సభకు వెల్లడించారు. గతంలో జమ్మూకశ్మీర్‌లో శాసనసభ నియోజకవర్గాల సంఖ్య 83 ఉండగా.. తాజా బిల్లులో దాన్ని 90కి పెంచాలని ప్రతిపాదించారు. ఇంతకుముందు కశ్మీర్ డివిజన్‌లో 46, జమ్ము డివిజనులో 37 స్థానాలు ఉండేవి. తాజా బిల్లులో కశ్మీర్ డివిజన్‌లో అసెంబ్లీ స్థానాలను 47, జమ్ము డివిజన్‌లో 43కు పెంచినట్లు అమిత్ షా వెల్లడించారు. ఇక పాక్ ఆక్రమిత కశ్మీర్ మన దేశంలో భాగమేనని ఆయన అన్నారు. అందుకే, అక్కడ కూడా 24 స్థానాలను రిజర్వ్ చేసినట్లు ప్రకటించారు. ఇక, కశ్మీర్‌లో రెండు స్థానాలను కశ్మీర్ నుంచి వలసవెళ్లినవాళ్లు, ఒక స్థానాన్ని పాక్ ఆక్రమిత కశ్మీర్ నుంచి వచ్చి స్థిరపడినవారికి రిజర్వ్ చేసినట్లు అమిత్ షా తెలిపారు. తొలిసారిగా ఎస్సీ/ఎస్టీ కమ్యూనిటీలకు 9 స్థానాలు కేటాయించినట్లు పేర్కొన్నారు.

**కశ్మీర్ బిల్లులతో వారికి న్యాయం..** "70 ఏళ్లుగా అన్యాయానికి, అవమానాలకు గురైన వారికి న్యాయం చేసేందుకు ఈ బిల్లులను ప్రవేశపెడుతున్నాను. ఏ సమాజంలోనైనా వెనుకబడిన వారిని ముందుకు తీసుకురావాలి. ఈ క్రమంలో వారి గౌరవానికి ఏమాత్రం భంగం కలగకుండా చూడాలి. అదే భారత రాజ్యాంగం ప్రాథమిక ఉద్దేశం. ప్రస్తుతం చాలా మంది కశ్మీరీలు శరణార్థి శిబిరాల్లో తలదాచుకొంటున్నారు. ఈ బిల్లుతో వారికి హక్కులు, ఉద్యోగాలు, విద్యావకాశాలు, రిజర్వేషన్ల సాయంతో ఎన్నికల్లో నిలబడే అవకాశాలు వస్తాయి" అని అమిత్‌షా వెల్లడించారు.

ఇక ప్రతిపక్షాలు కశ్మీర్‌లో ఆర్టికల్ 370 తొలగింపు తర్వాత కూడా ఉగ్రవాదం కొనసాగడంపై అడిగిన ప్రశ్నకు అమిత్‌షా స్పందించారు. "మోదీ ప్రభుత్వం వచ్చాక పౌర మరణాల్లో 70 శాతం, భద్రతా సిబ్బంది మరణాల్లో 62శాతం తగ్గుముఖం పట్టాయి. ఆర్టికల్ 370 తొలగింపుతో ఉగ్రవాదం అంతమైపోతుందని ఎవరూ చెప్పలేదు. వేర్పాటువాదం అంతమవుతుందని నేను చెప్పాను. 2027 నాటికి ఉగ్రవాద ఘటనలు సున్నాకు తీసుకురావడం కోసం ప్రణాళికలు రచిస్తున్నాం" అని వెల్లడించారు.




మిగ్‌జాం తుపాను వాయుగుండంగా బలహీనపడింది. ఇది మధ్యాహ్నానికి అల్పపీడనంగా బలహీనపడే అవకాశముంది. దీని ప్రభావంతో ఏపీలో వర్షాలు కొనసాగుతున్నాయి. మరో 24 గంటలపాటు కోస్తాంధ్ర, రాయలసీమతో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురవనున్నాయి. తుపాను ప్రభావంతో ఏపీలోని పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం దాములూరు కూడలి వద్ద వైరా, కట్టలేరు వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. తెలంగాణ నుంచి భారీగా నీరు చేరడంతో పల్లంపల్లి-దాములూరు గ్రామాల మధ్య కాజ్‌వే మీదుగా వరద ప్రవహిస్తోంది. వీరులపాడు-నందిగామ మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాల్లోంచి వరదనీరు వెళ్తోంది. దీంతో రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. కట్లేరు, పడమటి, ఎదుళ్ల, విప్ల, గుర్రపు, కొండవాగులు ఉద్ధృతంగా ఉన్నాయి. తెలంగాణ నుంచి వస్తున్న వరదతో కట్లేరు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. గంపలగూడెం మండలం వినగడప వద్ద తాత్కాలిక వంతెన పైనుంచి వరదనీరు వెళ్తోంది. దీంతో గంపలగూడెం- విజయవాడ మార్గంలో రెండు జిల్లాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కాకినాడ జిల్లా తుని, కోటనందూరు మండలాల్లో భారీ వర్షం కురిసింది. కోటనందూరు మండలం కాకరాపల్లి వద్ద బొండుగడ్డ వాగు పొంగి ప్రవహిస్తోంది. తుని-నర్సీపట్నం ప్రధాన రహదారిపైకి వరద చేరింది. దీంతో ఆ మార్గంలో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్టీసీ బస్సులు సైతం నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తూర్పుగోదావరి జిల్లా ములగపూడి-బలరాంపురం మధ్య రోడ్డుపైకి భారీగా వరదనీరు చేరింది. రౌతులపూడి మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట నీటమునిగింది. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం పరదానిపుట్టు వంతెనపై వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో సుమారు 50 గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దేవీపట్నం మండలం ఇందుకూరుపేట వద్ద కొండవాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. గోకవరం వైపు రాకపోకలు నిలిచిపోయాయి. అనకాపల్లి జిల్లా వడ్డాది వద్ద పెద్దేరుపై ఉన్న కాజ్‌వే పైనుంచి వరద ప్రవహిస్తోంది. నక్కపల్లి మండలంలో ఎడతెరిపిలేని వర్షం కురుస్తోంది. అక్కడ చేనేత కాలనీ నీటమునిగింది. ఎలమంచిలిలో వర్షానికి జగనన్న కాలనీలు ముంపునకు గురయ్యాయి. ఏటికొప్పాక వద్ద వరాహ నది, సోమలింగపాలెం సమీపంలో శారదా నది ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. పాయకరావుపేటలో అంబేడ్కర్ కాలనీ నీటమునిగింది. ఏలూరు జిల్లా దెందులూరు మండలం పోతునూరులో కురిసిన భారీ వర్షానికి పంటలు నీటమునిగాయి. పొలాల్లో ధాన్యం రాశులు తడిసిపోయాయి. తడవకుండా ఉన్న ధాన్యాన్ని రైతులు ఇళ్లకు తరలించారు. కొవ్వలిలో ధాన్యం రాశుల చుట్టూ వరదనీరు చేరడంతో రైతులు లబోదిబోమంటున్నారు. సత్యనారాయణపురంలో వరికుప్పలు నీటమునిగాయి. బాపట్ల జిల్లా చినగంజాం, మార్టూరు, యద్దనపూడి మండలాల్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పర్చూరు మండలంలో రెండు రోజులుగా సరఫరా లేదు. తుపాను దెబ్బకు నెల్లూరు డివిజన్ పరిధిలో 250కి.మీ, కావలి డివిజన్‌లో 170 కి.మీ మేర ఆర్‌అండ్‌బీ రహదార్లు దెబ్బతిన్నాయి. నెల్లూరు డివిజన్‌లో విద్యుత్ శాఖకు రూ.10కోట్ల మేర నష్టం వాటిల్లింది. 4,500 విద్యుత్ స్తంభాలు విరిగిపడగా.. 1,081 ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేశారు.


## డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవలు నిరుపమానం

### అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా సీఎం వైయస్ జగన్ నివాళులు



తాడేపల్లి: నేడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. నివాళులు అర్పించారు. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ చేసిన సేవలు నిరుపమానమని సీఎం జగన్ అన్నారు. కాగా, సీఎం జగన్ ట్విట్టర్ వేదికగా..'భారత రాజ్యాంగ ప్రదాత, దేశ పాలనా మార్గదర్శకాల విధాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ గారి వర్ధంతి నేడు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు నిరుపమానం. ఆ మహనీయుని అడుగుజాడల్లో నడుస్తూ మన ప్రభుత్వం బడుగు బలహీనవర్గాల సంక్షేమానికి అహర్నిశలూ కృషి చేస్తోంది. బాబా సాహెబ్ గారి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు' అంటూ వ్యాఖ్యలు చేశారు. మరోవైపు.. తాడేపల్లిలోని క్యాంపు కార్యాయలంలో సీఎం జగన్.. అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన సీఎం జగన్. ఈ కార్యక్రమానికి మంత్రులు తానేటి వనిత, మేరుగ నాగార్జున, ఎంపీ నందిగం సురేష్, ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకర్ తదితరులు హాజరయ్యారు.

## ప్రకాశం బ్యారేజి వద్ద గరిష్ఠంగా నీటి మట్టం.. 10 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల



విజయవాడ: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని చాలా ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో విజయవాడలోని ప్రకాశం బ్యారేజీకి వరద పోటెత్తుతోంది. ప్రస్తుతం బ్యారేజీ నీటిమట్టం 12 అడుగుల గరిష్ఠానికి చేరింది. దీంతో పది గేట్లు ఎత్తి 6000 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. కాలువలకు సైతం నీటి విడుదలను నిలిపేశారు.




# హీరోయిన్ కిక్స్ నిజం.. దెబ్బలు నిజం.. కన్నీళ్లు నిజం

హీరోయిన్స్ అంటే చాలా సుకుమారంగం, కష్టం అంటే తెలియకుండా అందాన్ని కాపాడుకోవడానికి ఎప్పుడూ మేకప్ వేసుకుని ఉంటారు అనుకుంటారు. కానీ కొందరు హీరోయిన్స్ మాత్రం అందకు విరుద్ధంగా ఉంటారు. తమకు ఇచ్చిన పాత్రకు న్యాయం చేసేందుకు ఎంత దూరం అయినా వెళ్తారు.. ఎంత కష్టానికి అయినా సిద్ధం అంటారు. ఈ మధ్య కాలంలో హీరోయిన్స్ మధ్య ఉన్న పోటీ నేపథ్యం లో చాలా మంది హీరోయిన్స్ ఆ తరహా కష్టాన్ని ప్రదర్శించేందుకు సిద్ధం అవుతున్నారు. యాక్షన్ సన్నివేశాల్లో హీరోయిన్స్ అంటే ఒకప్పుడు ఎక్కువగా డూప్స్ వాడేవారు. కానీ ఇప్పుడు డూప్ లేకుండా రియల్ గానే స్టంట్స్ చేస్తున్నారు. స్టంట్స్ చేస్తూ కష్టపడే హీరోయిన్స్ జాబితాలో కళ్యాణి ప్రిదర్శన్ చేరారు. స్టార్ కిడ్ గా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన




ఈమె ఆశించిన స్థాయిలో సక్సెస్ లను అందుకోలేక పోయింది. అయితే ప్రయత్నాలు వదలకుండా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ వస్తోంది. తాజాగా ఆంటోనీ సినిమాతో మలయాళం ప్రేక్షకుల ముందుకు కళ్యాణి ప్రియదర్శిని వచ్చింది. ఆ సినిమా కోసం కళ్యాణి ఏ స్థాయిలో కష్టపడిందో సినిమా చూస్తే అర్థం అవుతుంది. తాజాగా సోషల్ మీడియా ద్వారా కళ్యాణి తన కష్టంకు సంబంధించిన కొన్ని ఫోటోలు మరియు వీడియోలను షేర్ చేసింది. బాక్సింగ్ ప్రాక్టీస్ సందర్భంగా నిజమైన కిక్స్ తిన్నాను.. నా ఒంటి మీద ఉన్నవి నిజమైన దెబ్బలు, నా కంటి నుండి వచ్చిన నీళ్లు నిజమైన కన్నీళ్లు అంటూ కళ్యాణి సోషల్ మీడియా ద్వారా చెప్పుకొచ్చింది. మొత్తానికి కళ్యాణి హీరోయిన్ గా తనకు వచ్చిన పాత్రకు న్యాయం చేసేందుకు సాధ్యం అయినంత కష్టపడ్డట్లుగా చెప్పుకొచ్చింది. ముందు ముందు కూడా ఇలాంటి పాత్రలు అప్పగిస్తే సిద్ధం అన్నట్లుగా కళ్యాణి ఈ పోస్ట్ ద్వారా చెప్పకనే చెబుతుంది అనిపిస్తోంది.

# ఎక్స్ ట్రా నవ్వకపోతే డబ్బులు మీవే

నితిన్ హీరోగా వక్కంతం వంశీ దర్శకత్వంలో తెరకెక్కి ప్రేక్షకుల ముందుకి రాబోతున్న సినిమా ఎక్స్ట్రార్డినరీ. హెూం ప్రొడక్షన్ లోనే ఈ సినిమాని నితిన్ తండ్రి నిర్మించారు. ఇప్పటికే ప్రేక్షకుల ముందుకి వచ్చిన ట్రైలర్ ని మంచి రెస్పాన్స్ వస్తోంది. నా పేరు సూర్య సినిమా తర్వాత వక్కంతం వంశీ సీనియస్ కథని తీసుకోకుండా అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్టైనర్ ని ట్రై చేశారు. ఈ సినిమా ప్రమోషన్స్ ని నితిన్ జోరుగా చేస్తున్నారు. ఇంటర్వ్యూలు కూడా ఇస్తున్నాడు. క్రేజీ హీరోయిన్ శ్రీలీల ఈ మూవీలో నితిన్ కి జోడీగా నటిస్తోంది. ఈ మధ్యకాలంలో కమర్షియల్ కామెడీకి ఆడియన్స్ పట్టం కడుతున్నారనే సంగతి అందరికి తెలిసిందే. రీసెంట్ గా వచ్చిన మ్యాడ్ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. ఈ మూవీ రిలీజ్ సందర్భంగా



నిర్మాత నాగవంశీ ఆసక్తికర కామెంట్స్ చేశారు. మ్యాడ్ చూసిన వాళ్ళ నవ్వకుండా బయటకొస్తే టికెట్ డబ్బులు వాపస్ ఇస్తానని చాలెంజ్ చేశారు. నాగ వంశీ కామెంట్స్ కూడా మ్యాడ్ సినిమాకి ఆడియన్స్ పెరగడంలో హెల్ప్ అయ్యింది. తాజాగా నితిన్ కూడా అలాంటి కామెంట్స్ చేయడం విశేషం. నితిన్ లో హ్యూమర్ యాంగిల్ ఎక్కువ ఉంటుంది. ఇలాంటి సినిమా ప్రమోషన్స్ లో పంచ్ లు వేసి నవ్విస్తూ ఉంటారు. తన ఎక్స్ట్రార్డినరీ మూవీ కూడా ప్రేక్షకులని ఆద్యంతం నవ్విస్తుందని. ఎవరైనా నవ్వకుండా థియేటర్స్ నుంచి బయటకొస్తే టికెట్ డబ్బులు నాగ వంశీ వాపస్ ఇస్తారని అన్నారు. నాగవంశీకి నాకు లావాదేవీలు చాలా ఉన్నాయని, అందుకే అతనే చెల్లిస్తాడు అంటూ సరదాగా కామెంట్స్ చేశారు. ఈ కామెంట్స్ పై నాగ వంశీ రియాక్ట్ అయ్యి అప్పుడేదో సినిమా ప్రమోషన్ మూడ్ లో ఉండి అలా వాగేసా. ఇలా తనని లాక్ చేస్తే ఎలా అంటూ ఎమోజీ పెట్టి ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ ఇప్పుడు వైరల్ అవుతోంది.

ఈ మధ్య నితిన్ తాను చేసిన మాస్ సినిమాల విషయంలో కూడా ఇంటరెస్టింగ్ కామెంట్స్ చేశారు. మాస్ సినిమాలు తనకి సెట్ కావని, ఇకపై అలాంటి కథలు చేసే ప్రయత్నం చేయనని, ఎంటర్టైనర్ మూవీస్ తోనే వస్తానని చెప్పుకొచ్చారు.

# ఈగల్.. న్యూ లుక్కుతో మాస్ రాజా వైబ్రేషన్స్




మాస్ మహారాజా రవితేజ నుంచి నెక్స్ట్ రాబోతున్న సినిమా ఈగల్. యాక్షన్ థ్రిల్లర్ గా రూపొందుతున్న ఈ సినిమాకు కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్నాడు. టీజర్ కూడా ఇది వరకే విడుదల చేయగా మంచి రెస్పాన్స్ అందుకుంది. ఇక ఈగల్ సినిమాను 2024 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్న విషయం తెలిసిందే. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా యూనిట్ ప్రమోషన్స్ జోరు కూడా పెంచుతుంది. ఇక సినిమాలోని మొదటి పాటను కూడా విడుదల చేయడానికి సిద్ధమయ్యారు. ఆడు మచ్చ.. అనే ఒక పాటకు సంబంధించిన ప్రోమోను రీసెంట్గా యూట్యూబ్లో విడుదల చేశారు. అంతేకాకుండా రవితేజకు సంబంధించిన స్పెషల్ పోస్టర్ కూడా విడుదలైంది. అందులో మాస్ రాజా సరికొత్త అవతారంలో కనిపిస్తున్నాడు. ఇంతకుముందు ఎన్నడూ కనిపించిన విధంగా ఒక వైపు మాస్ ఎలిమెంట్ హైలెట్ చేస్తూనే మరొకవైపు యాక్షన్ హావభావాలు కూడా చూపిస్తున్నాడు. రవితేజ నిండు గెడ్డంతో లాంగ్ హెయిర్ తో లుంగీలో చాలా పవర్ఫుల్ గా ఉన్నాడు అని పోస్టర్ చూస్తేనే క్లియర్గా అర్థమవుతుంది. ఇక సాంగ్ లో కూడా అదిరిపోయే స్టెప్పులతో సర్ప్రైజ్ ఇవ్వబోతున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి ఈ పాట థియేటర్లో కూడా విజిల్ వేసే విధంగా ఉంటుంది అని కామెంట్స్ వినిపిస్తున్నాయి. దేవ్ కంపోజ్ చేసిన ఈ పాట ను రాహుల్ సిప్లిగంజ్ పాడారు ఇక ఈ పూర్తి లిరికల్ సాంగ్ ను డిసెంబర్ 5వ తేదీన సాయంత్రం 6 గంటలకు యూట్యూబ్ ద్వారా విడుదల చేయబోతున్నారు. తప్పకుండా ఈ ఫుల్ సాంగ్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతుంది అని చిత్ర యూనిట్ నమ్ముతోంది. ఇక ఈ సినిమాతో రవితేజ కూడా మంచి సక్సెస్ అందుకోవాలని అనుకుంటున్నాడు. ప్రతి సినిమాలో ఏదో కొత్త తరహా కథను చెప్పే ప్రయత్నం చేస్తున్న మాస్ రాజా ఈ సినిమాలో కూడా ఒక డిఫరెంట్ యాక్షన్ ను చూపించబోతున్నట్లుగా తెలుస్తోంది. యువదర్శకుడు కార్తీక్ ఘట్టమనేని గతంలో సూర్య వర్సెస్ సూర్య అనే సినిమా చేసి విమర్శకుల ప్రశంసలు అందుకున్నాడు. ఇక ఇప్పుడు రవితేజతో చేస్తున్న ఈగల్ సినిమాతో కూడా దర్శకుడుగా అతను మంచి గుర్తింపును అందుకోవాలని కష్టపడుతున్నాడు. ఈగల్ సినిమాను పీపుల్స్ మీడియో ఫ్యాక్టరీలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. మరి సంక్రాంతిలో ఈ సినిమా ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి.

# నేషనల్ క్రష్‌లో ఈ కోణం?



'యానిమల్' పాన్ ఇండియా విజయంతో రష్మిక మందన్న ఆనందంలో మునిగి తేల్తోంది. రణబీర్ కపూర్, బాబీ డియోల్, అనిల్ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'యానిమల్'కి దేశవ్యాప్తంగా మంచి ఆదరణ లభించడంతో నేషనల్ క్రష్ రష్మిక మందన్న చాలా ఆనందంగా ఉంది. తన అభిమానులకు కృతజ్ఞతలు తెలిపేందుకు ఇన్‌స్టాగ్రామ్ ని ఆశ్రయించింది. తండ్రీకొడుకుల అనుబంధం నేపథ్యంలో రూపొందించిన యానిమల్ బాక్సాఫీస్ వద్ద ఓపెనింగుల్లో రూ.100 కోట్ల మార్కును దాటింది. ముఖ్యంగా రణబీర్ నటనపై ప్రశంసలతో పాటు, ఈ చిత్రంలో రష్మిక మందన్న నటనకు గొప్ప గుర్తింపు దక్కింది. తన అద్భుత నటప్రదర్శనకు అభిమానుల నుండి విపరీతమైన ప్రేమను పొందుతోంది. రష్మిక కూడా తన సోషల్ హ్యాండిల్ లో వారి ప్రేమకు ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపింది. దానితో పాటు ఒక ఫోటోను కూడా షేర్ చేసి, సీక్వెల్ గురించి అభిమానులను ఆటపట్టించింది. ఇంతకుముందు అలియా భట్ కూడా రష్మిక నటనను ప్రశంసిస్తూ ఇన్ స్టా పోస్ట్‌ను షేర్ చేసింది. రష్మిక అత్యుత్తమ నటనకు ఫిదా అయిపోయిన ఆలియా నేషనల్ క్రష్ క్లబ్ లో తాను కూడా చేరానని ప్రకటించింది. తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్‌లో రష్మిక మందన్న ఒక ఫోటోను షేర్ చేస్తూ, "మా యానిమల్ పై మీరు చూపుతున్న ప్రేమకు చాలా కృతజ్ఞతలు.. మేము మీ అందరినీ చాలా సంతోషపరిచామని ఆశిస్తున్నాను.. #Animalpark (మీరు ఉంటే) మీకు తెలుసా) మీకు తెలియకపోతే దయచేసి మీ దగ్గరలోని థియేటర్‌లలోకి వెళ్లి చూసి ఆనందించండి!" అని టీజ్ చేసింది. విజయానందంలో ఉన్న రష్మిక మందన్న సోషల్ మీడియాల్లో మరింత స్పీడ్ పెంచింది. వరుస ఫోటోషూట్లను షేర్ చేస్తూ అభిమానులకు టచ్ లో ఉంటోంది. తాజాగా గ్రే షేడెడ్ డ్రెస్ లో రష్మిక ఎంతో డీసెంట్ గా కనిపించిన ఒక ఫోటోషూట్ ని షేర్ చేసింది. ఈ దుస్తుల్లో రష్మిక ఎంతో సాంప్రదాయబద్ధంగా కనిపించింది. గ్రేషేడ్ డ్రెస్ కి తగ్గట్టుగా అదే షేడ్ ఉన్న నేపథ్యం ఎంతో ఘాడమైన ముద్ర వేస్తోంది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్స్ నేషనల్ క్రష్ అభిమానుల్లో వైరల్ గా మారుతున్నాయి.

# చిలకాకు పచ్చ కోకలో దక్షా దుమారం!

'హెూరా హెూరి' చిత్రంతో ఎంట్రీ ఇచ్చిన ముంబై భామ దక్షా నగార్కర్ టాలీవుడ్ కి సుపరిచితురాలే. తొలి సినిమా తో యావరేజ్ సక్సెస్ అందుకుని నటిగా పాస్ మార్కులు వేయించుకుంది. అటుపై హుషారు సక్సెస్ తో యూత్ లో ఫేమస్ అయింది. అమ్మడి పెర్ఫార్మెన్స్ కి యువత ఫిదా అయింది. ఆ వెంటనే జాంబీ రెడ్డితో మరో సక్సెస్ ని అమ్మడు ఖతాలో వేసుకుంది. ఇలా మూడు విజయాలు దక్షాకి టాలీవుడ్ లో మంచి ఐడెంటీని తీసుకొచ్చాయి. దీంతో పాటు మాస్ రాజా రవితేజ్ రావణాసూరలో నూ..అంతకు ముందు బంగార్రాజు చిత్రాల్లోనూ అవకాశం అందుకుంది. కానీ ఈ రెండు సినిమాలు అమ్మడికి ఆశించిన ఫలితాన్నివ్వలేదు. కానీ ఐడెంటిటీ మాత్రం ఎక్కడా చెక్కు చెదరలేదు. అప్పటివరకూ ఓ సెక్షన్ ఆడియన్స్ కే పరిమితమైన



దక్షా నాటి నుంచి మాస్ ఆడియన్స్ లోనూ క్రేజీ బ్యూటీగా మారింది. ఇక అమ్మడి ఇన్ స్టా క్రేజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఎప్పటికప్పుడు కొత్త ఫోటోలతో యువతలో హాట్ టాపిక్ గా మారుతుంటుంది. డిజైనర్ దుస్తుల్లో తనదైన మార్క్ అప్పిరియన్స్ తో అలరిస్తుంటుంది. తాజాగా అమ్మడు చీరందంలో తళుకులినింది. ఇదిగో ఇక్కడిలా చిలకాకు పచ్చ చీరలో..మ్యాచింగ్ రవిక ధరించి బ్యూటీలో అందాలన్ని ఆవిష్కరించింది. నేలపై అమ్మడు వయ్యారంగా కూర్చుని ఇచ్చిన భంగిమకి యువత ఫిదా అవుతుంది. ఈ ఫోటోని ఉద్దేశించి కుర్రాళ్లందరికీ ఓ హాట్ కామెంట్ కూడా విసిరిందండోయ్. నేను గ్రీన్ లైట్. మీరంతా షేకైపోవాలి అంటూ రాసుకొచ్చింది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. దీంతో కామెంట్ బాక్స్ లో యువత కామెంట్లకు కొదవలేదు. అమ్మడు పుట్టి పెరిగింది ముంబైలోనే. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ చదువుతూనే మోడలింగ్ వైపు వచ్చింది. ఓ వైపు చదువు..మరోవైపు మోడలింగ్ రెండింటిలోనూ చురుకుతనం చూపించింది. సినిమాల్లోకి రాకముందు కొన్ని రకాల ప్రకటనల్లోనూ నటించింది. అక్కడ నుంచి నేరుగా టాలీవుడ్ లోనే లాంచ్ అయింది. అంతకు ముందే సోషల్ మీడియాలో ఫేమస్ అయింది.

# కృతి పరువు నష్టం దావా

పాపులర్ ట్రేడింగ్ కంపెనీలతో తన అనుబంధం ప్రచారంపై తప్పుడు కథనాలు రావడంపై కృతి గుర్రుగా ఉంది. ఈ మ్యాటర్ సీరియస్ టర్న్ తీసుకుంది. పరువు నష్టం దావా వరకూ వెళ్లింది. వివరాల్లోకి వెళితే.. కరణ్ జోహార్ పాపులర్ చాట్ షో 'కాఫీ విత్ కరణ్'లో తాను కనిపించవచ్చని కృతి సనన్ గతంలో ఛూఛాయగా పేర్కొంది. జాన్వీ కపూర్‌తో కలిసి కాఫీ సోఫాను అలంకరించనున్నట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. అయితే ఈ ఊహాగానాల నడుమ కృతిపై తప్పుడు ప్రచారం సీరియస్ టర్న్ తీసుకుంది. ఇదే విషయమై కృతి ఒక ప్రకటన విడుదల చేసింది. తనపై తప్పుడు వార్తలను వ్యాప్తి చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. తాను 'కాఫీ విత్ కరణ్ 8'లో కొన్ని ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్‌లను ప్రమోట్ చేసినట్లు కథనాలు వెలువడ్డాయని కృతి చెప్పారు. ఈ వాదనలను డిసెంబర్ 8 ఆదివారం నాడు తన ఇన్‌స్టాగ్రామ్ లో ఖండించారు. అవన్నీ ఫేక్ న్యూస్ అని కృతి కొట్టి పారేసింది. ఈ పరువు నష్టం కలిగించే వార్తలపై



తాను చట్టపరమైన చర్య తీసుకున్నట్లు కూడా వెల్లడించింది. కృతి సామాజిక మాధ్యమంలో ఇలా రాసింది. "కాఫీ విత్ కరణ్‌లో కొన్ని ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్‌లను ప్రమోట్ చేస్తున్నాను అంటూ నా గురించి పలు తప్పుడు కథనాలు వచ్చాయి. ఈ కథనాలు పూర్తిగా నకిలీవి.. నిజాయితీ లేని దుర్మార్గపు ఉద్దేశ్యంతో ప్రచురించినవి. అన్నీ అబద్ధాలు" అని వ్యాఖ్యానించింది. "ఈ కథనాలు పరువు నష్టం కలిగించేవి.. ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్‌లతో తప్పుడు అనుబంధం కలుపుతూ సమస్యాత్మకంగా రాస్తున్నారు. షోలో ఏ ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్ గురించి నేను ఎప్పుడూ మాట్లాడలేదు. అటువంటి తప్పుడు కథనాలు నివేదికలపై నేను చట్టపరమైన చర్యలు తీసుకున్నాను. లీగల్ నోటీసు జారీ చేసాను. ఇలాంటి తప్పుడు నకిలీ, పరువు నష్టం కలిగించే కథనాలపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని అభ్యర్థిస్తున్నాను"అని అన్నారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. ఈ ఏడాది ఆదిపురుష్ 3డి కృతిని తీవ్రంగా నిరాశపరిచింది. ఇటీవల టైగర్ ష్రాఫ్‌తో గణపత్‌లో కనిపించింది. హీరోపంటిలో కలిసి నటించిన తర్వాత ఈ చిత్రం వారి రెండవ కలయిక ఇది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద అనూహ్యంగా ఫెయిలైంది. దీంతో మరోసారి నిరాశ తప్పలేదు. కానీ 'మిమీ'లో నటనకు గాను కృతి ఉత్తమ నటిగా జాతీయ అవార్డును అందుకోవడం పెద్ద ఊరట. తదుపరి పేరులేని ఫ్యూచరిస్టిక్ లవ్ స్టోరీలో షాహిద్ కపూర్‌తో కలిసి కనిపించనుంది. టబు, దిల్జిత్ దోసాంజ్, కరీనా కపూర్ ఖాన్‌లతో కలిసి 'ది క్రూ' సెట్స్ పై ఉంది. కాఫీ విత్ కరణ్ విషయానికొస్తే.. ఈ షోలో కృతి– జాన్వీల ప్రదర్శనను మేకర్స్ ఇంకా ధృవీకరించలేదు.



# రేవంత్ ప్రమాణస్వీకారం.. కేసీఆర్, చంద్రబాబుకు ఆహ్వానం

హైదరాబాద్: తెలంగాణ నూతన సీఎంగా రేవంత్‌రెడ్డి గురువారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఏఐసీసీ నేతలు, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు ఇతర రాష్ట్రాల సీఎంలు, మాజీ సీఎంలు, వివిధ రాజకీయ పార్టీల నేతలకు టీపీసీసీ ఆహ్వానాలు పంపింది. ఏపీ సీఎం జగన్, తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్, తమిళనాడు సీఎం స్టాలిన్, తెదేపా అధినేత చంద్రబాబులను ఆహ్వానించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో పాటు అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకలను రేవంత్‌రెడ్డే దిల్లీ వెళ్లి స్వయంగా ఆహ్వానించారు. కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, ఆ రాష్ట్ర మంత్రులకు ఆహ్వానాలు పంపారు. సీనియర్ నేతలు చిదంబరం, అశోక్ గెహ్లాత్, దిగ్విజయ్ సింగ్, వీరప్ప మొయిలీ, మీరాకుమార్, కుంతియా, భూపేష్ బఘేల్, అశోక్ చవాన్, వాయలార్ రవి, సుశీల్‌కుమార్ శిందే, మాణికం ఠాగూర్, కురియన్‌లను ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించారు. వీరితో పాటు తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ఆహ్వానం పంపారు. తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, గాదె ఇన్నయ్య, ప్రొఫెసర్ హరగోపాల్, కంచె ఐలయ్యలతో పాటు వివిధ కులసంఘాల నేతలను ఆహ్వానించారు. ప్రమాణస్వీకారానికి రావాల్సిందిగా పలువురు సినీ ప్రముఖులకు కూడా కాంగ్రెస్ పార్టీ తరఫున ఆహ్వానాలు పంపారు.

# తెలంగాణలో ప్రజా ప్రభుత్వాన్ని నిర్మిస్తాం: రాహుల్ గాంధీ



దిల్లీ: తెలంగాణలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వాన్ని నిర్మిస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో గురువారం రేవంత్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

ఈ కార్యక్రమానికి సోనియా, రాహుల్, ప్రియాంకలను రేవంత్ ఆహ్వానించారు. అనంతరం రాహుల్ గాంధీ ఎక్స్(ట్విటర్)లో ఆ ఫొటోలను షేర్ చేశారు.

"తెలంగాణకు కాబోయే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు. ఆయన నాయకత్వంలో ఏర్పడే కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తుంది. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజా ప్రభుత్వాన్ని నిర్మిస్తాం" అని రాహుల్ పేర్కొన్నారు.



# వారి రాజకీయ చతురత రాహుల్‌కు అబ్బలేదు..!

## డైరీలో రాసుకున్న మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ

గాంధీ-నెహ్రూ కుటుంబాల వారసుడిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టిన రాహుల్ గాంధీకి రాజకీయ చతురత మాత్రం వారసత్వంగా అబ్బలేదని మాజీ రాష్ట్రపతి, కాంగ్రెస్ సీనియర్ నేత ప్రణబ్ ముఖర్జీ అభిప్రాయపడ్డారట. ఇదే విషయాన్ని ఆయన కొన్నేళ్ల కిందట తన డైరీలో రాసుకున్నారట. తన తండ్రి జీవితంపై రాసిన పుస్తకంలో ప్రణబ్ కుమార్తె శర్మిష్ఠ ఈ అంశాన్ని ప్రస్తావించారు. 'ఇన్ ప్రణబ్, మై ఫాదర్: ఏ డాటర్ రిమెంబర్స్' పేరుతో శర్మిష్ఠ ఈ పుస్తకాన్ని రచించారు. బతికున్న రోజుల్లో తన తండ్రి చెప్పిన విషయాలు, ప్రణబ్ డైరీతో పాటు ఆయన రాజకీయ జీవితంపై అధ్యయనం చేసి ఆమె ఈ పుస్తకాన్ని రాశారు. అందులో నెహ్రూ-గాంధీ కుటుంబం పట్ల ఆయనకున్న వ్యక్తిగత ఆరాధన, రాహుల్ గాంధీ రాజకీయ భవిష్యత్తు.. ఇలా పలు ఆసక్తికర అంశాలను వివరించారు. రాహుల్ గురించి ప్రణబ్ తన డైరీలో రాసుకున్న అభిప్రాయాలను కూడా శర్మిష్ఠ ఈ పుస్తకంలో ప్రస్తావించారు. "రాహుల్ చాలా మర్యాదగా ప్రవర్తిస్తారు. అనేక ప్రశ్నలు సంధిస్తారు. కానీ, రాజకీయాల్లో ఆయన పరిణతి సాధించలేదు. 2013 జులైలో రాహుల్ ఓ సారి మా ఇంటికి వచ్చారు. పార్టీ పునరుద్ధరణకు సంబంధించి తన ప్రణాళికలను చెప్పారు. ఆయన సవాళ్లను ఎదుర్కోగలరని అనిపించింది. అయితే, ముందు కేబినెట్‌లో చేరి పాలనాపరమైన అంశాల్లో అనుభవం గడించాలని చెప్పా. కానీ నా సలహాను ఆయన వినిపించుకోలేదు" అని ప్రణబ్ నాటి సంగతులను తన డైరీలో రాసుకున్నారు.

**రాహుల్ ఆనాటి చర్యతో యూపీఏ మరింత పతనం..** ఇక, 2013లో అప్పటి యూపీఏ ప్రభుత్వం జారీచేసిన ఆర్డినెన్స్ ప్రతులను రాహుల్ మీడియా ముందు చించేసిన ఘటనను కూడా శర్మిష్ఠ ఈ పుస్తకంలో ప్రస్తావించారు. ఆ విషయం తెలియగానే ప్రణబ్ ముఖర్జీ తీవ్ర ఆగ్రహానికి గురయ్యారట. "రాహుల్ అసలు ఏమనుకుంటున్నారు? ఆయన కేబినెట్ సభ్యుడు కాదు. కేబినెట్ నిర్ణయాన్ని బహిరంగంగా చించేయడానికి ఆయనెవరు? ప్రధాని విదేశాల్లో ఉన్నారు. తన చర్యలు ప్రధానిపై, ప్రభుత్వంపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది ఆయనకు తెలుసా?" అని ఆరోజు ప్రణబ్ ఆగ్రహించినట్లు శర్మిష్ఠ తన పుస్తకంలో పేర్కొన్నారు. ఈ ఘటన తర్వాత ప్రణబ్ తన డైరీలో.. "గాంధీ-నెహ్రూ కుటుంబాల అహంకారమంతా రాహుల్‌కు వచ్చింది. కానీ వారి రాజకీయ చతురతే ఆయనకు అబ్బలేదు" అని రాసుకున్నారట. రాహుల్ అలా ఆర్డినెన్స్ పత్రాలను చించేయడంతోనే యూపీఏ కూటమి మరింత పతనమైందని ప్రణబ్ అభిప్రాయపడ్డారు. "2014 ఎన్నికల్లో యూపీఏ ఓటమికి ఇది కూడా ఓ కారణమే. ప్రధానినే గౌరవించని వారికి ఎవరైనా ఎందుకు ఓటేస్తారు" అని అప్పట్లో ఆయన పార్టీకి తెలిపినట్లు శర్మిష్ఠ తన పుస్తకంలో పేర్కొన్నారు. జైలు శిక్షపై కింది కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ పైకోర్టులో అప్పీల్ చేయడానికి వీలుగా 'ఆటోమేటిక్ సస్పెన్షన్' నిబంధన 3 నెలల వరకు అమల్లోకి రాకూడదని ప్రజాప్రాతినిధ్య చట్టంలో ఉండేది. ఈ నిబంధనను 2013 జులై 10న సుప్రీంకోర్టు కొట్టేసింది. అయితే ప్రజాప్రతినిధుల కేసులు ఎగువ కోర్టుల్లో పెండింగ్‌లో ఉండగా వారిపై అనర్హత వేటు వేయడానికి వీల్లేదంటూ కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం 2013 ఆగస్టులో ప్రజాప్రాతినిధ్య చట్టం (రెండో సవరణ) బిల్లును తెచ్చింది. అది సభామోదం పొందకపోవడంతో దాణా కేసులో యూపీఏ భాగస్వామి లాలూ ప్రసాద్‌ను రక్షించడానికి కేంద్రం 2013 సెప్టెంబరు 24న ఆర్డినెన్స్ జారీచేసింది. జైలుశిక్ష పడ్డ నేతలపై తక్షణం అనర్హత వేటు పడకుండా చూసేందుకు ఈ చర్య చేపట్టింది. దీనిపై దేశవ్యాప్తంగా వ్యతిరేకత రావడంతో 2013 సెప్టెంబర్ 27న రాహుల్ విలేకర్ల సమావేశంలో ఆ ఆర్డినెన్స్ ప్రతులను చించేశారు.

# ఇద్దరు సీఎంలను ఓడించిన వెంకటరమణారెడ్డికి కీలక బాధ్యతలు..?



కామారెడ్డి: ఇద్దరు ముఖ్య నేతలను ఓడించిన కాటిపల్లి వెంకటరమణారెడ్డి అసెంబ్లీలో తొలిసారి అడుగుపెడుతున్నారు. ఆయనకు పార్టీ కీలక బాధ్యతలు అప్పగిస్తుందన్న అభిప్రాయం బీజేపీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. కామారెడ్డిలో ముఖ్యమంత్రిని, కాబోయే ముఖ్యమంత్రిని ఒకేసారి ఓడించడం ద్వారా చరిత్ర సృష్టించిన కేవీఆర్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, బీజేపీ జాతీయ నాయకులు సామాజిక మాధ్యమాల ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. కొందరు ఫోన్ చేసి జెయింట్ కిల్లర్ అంటూ అభినందించారు. కేవీఆర్ నామినేషన్ వేయక ముందు నిర్వహించిన బైక్‌ర్యాలీ, సభల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆయన ఫాలోయింగ్‌ను చూసి ఆశ్చర్యపోయారు. కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఏర్పడితే కేవీఆర్‌ను మంత్రి వర్గంలోకి తీసుకునేలా ప్రయత్నిస్తానని ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసేంత మంది ఎమ్మెల్యేలు గెలవకపోవడంతో మంత్రిని చేసే అవకాశం లేకుండాపోయింది. అయితే బీజేపీ శాసనసభా పక్షంలో ఆయనకు బాధ్యతలు అప్పగిస్తారన్న ప్రచారం జరుగుతోంది. ఇద్దరు రాజకీయ ఉద్ధండులను ఓడించిన వెంకటరమణారెడ్డికి కీలకమైన పదవి ఇవ్వాలని ఆయన అనుచరులు కోరుతున్నారు. రాజకీయాల మీద, వ్యవస్థల మీద అవగాహన ఉన్న వెంకటరమణారెడ్డికి అవకాశం ఇస్తే ఆయన అసెంబ్లీలో ఆయా అంశాల మీద తన గళాన్ని గట్టిగా వినిపించగలరన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పార్టీ నాయకత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న విషయమై శ్రేణుల్లో చర్చ సాగుతోంది.

# తొలి ఉద్యోగం రజినీకే! పీసీసీ చీఫ్‌గా మాటిచ్చిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడేమో సీఎంగా..



తెలంగాణలో తొలి ఉద్యోగం నాకే రాబోతున్నందుకు సంతోషంగా ఉంది. రేవంత్ రెడ్డి సార్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయబోతున్నారు. గాంధీ భవన్ వెళ్లినప్పుడు ఆయన నాకు ఉద్యోగం ఇస్తామని మాట ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీ ఆయన నెరవేరుస్తుండడం హ్యాపీగా ఉంది.. **:::రజిని**

అధికారంలోకి గనుక వస్తే.. అంటూ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో సర్కార్ ఏర్పాటు అవుతున్న తరుణంలో వాటిని నెరవేర్చేందుకు సిద్ధమైపోయింది. రేపు డిసెంబర్ 7న ఎల్బీ స్టేడియంలో రేవంత్ ప్రమాణం ముఖ్యమంత్రిగా చేయనున్నారు. ఈ సందర్భంగా ఆరు గ్యారెంటీ హామీలు నెరవేర్చడంపైనా ఆయన స్పష్టమైన ఒక ప్రకటన చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే.. తొలి ఉద్యోగం కూడా ఎవరికి ఇవ్వాలనే దానిపై ఓ క్లారిటీతో ఉన్నారు. తెలంగాణ కాంగ్రెస్ పాలనలో తొలి ఉద్యోగం రజినీ అనే యువతికి దక్కనుంది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేయాలని అధికార యంత్రాంగాన్ని రేవంత్‌రెడ్డి ఇప్పటికే ఆదేశించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే.. తొలి ఉద్యోగం రజినీకి ఇస్తాం అని స్వయంగా ప్రకటన చేసిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడా గ్యారెంటీని నెరవేర్చేందుకు రెడీ అయిపోయారు. అక్టోబర్ 17వ తేదీన.. నాంపల్లికి చెందిన రజిని అనే ఓ దివ్యాంగురాలు గాంధీభవన్‌కు వెళ్లి రేవంత్‌రెడ్డిని కలిశారు. రజిని రెండేళ్ల క్రితం పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకుని ఉద్యోగం కోసం వెతుకుతోంది. పీజీ చేసిన తనకు ఇటు ప్రభుత్వంలోనూ అటు ప్రైవేటులోనూ ఉద్యోగం రావట్లేదని తన బాధను టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డికి చెప్పింది. అప్పుడు రేవంత్ రెడ్డి .. "కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మొదటి ఉద్యోగం నీకే ఇస్తాం. డిసెంబర్ 9న ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ సీఎం ప్రమాణ స్వీకార సభ ఉంటుంది. ఆ సభకు మల్లిఖార్జున ఖర్గే, సోనియా గాంధీ వస్తారు. ఆ సభలోనే మొదటి ఉద్యోగం నీకేనమ్మా. ఇది నా గ్యారెంటీ" అంటూ రేవంత్ ఆమెకు హామీ ఇచ్చారు. అంతేకాదు.. కాంగ్రెస్ గ్యారెంటీ కార్డు మీద స్వయంగా ఆయన రజినీ పేరు రాసి.. కింద సంతకం కూడా చేశారు.

# రాష్ట్ర ప్రభుత్వం, ఉద్యోగులకు మధ్య వారధిగా ఉంటా: కోదండరామ్



హైదరాబాద్: తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు అవుతోన్న నేపథ్యంలో రాష్ట్ర సచివాలయం వద్ద ఉద్యోగులు సంబురాలు చేసుకున్నారు. సచివాలయం వద్ద బాణసంచా కాల్చి సంతోషం వ్యక్తం చేశారు. ఉద్యోగులతో పాటు తెలంగాణ జనసమితి (తెజస) అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ కూడా సంబురాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ.. "ఉద్యోగ సంఘ నేతలతోనే ఉద్యోగుల హక్కులను హరించారు. కొత్త ప్రభుత్వంలో ప్రజాస్వామిక పాలన ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం, ఉద్యోగులకు మధ్య వారధిగా ఉంటా. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నిస్తాం" అని కోదండరామ్ అన్నారు.

# ఎవరికి వారే.. మంత్రి పదవుల కోసం ఢిల్లీలో లాబీయింగ్



ఢిల్లీ: మంత్రి పదవి ఆశిస్తున్న కాంగ్రెస్ నేతలు ఢిల్లీలో లాబీయింగ్ ప్రారంభించారు. తెలంగాణ మంత్రి వర్గంలో చోటు కోసం ఎవరికి వారే ప్రయత్నాలు చేస్తున్నారు. ఢిల్లీలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, ప్రేమ్ సాగర్‌రావుతో పాటు పలువురు అధిష్టానం పెద్దలను కలిశారు. డీకే శివకుమార్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు.. మంత్రి పదవుల్లో స్థానం కల్పించాలని కోరినట్లు సమాచారం. అధిష్టానంపైనే సీనియర్లు ఆశలు పెట్టుకున్నారు. డీకే శివకుమార్‌ను కలిసిన దుద్దిళ్ల శ్రీధర్‌బాబు.. మంత్రి పదవి కోసం విజ్ఞప్తి చేశారు. ఆయన అనంతరం మీడియాతో మాట్లాడుతూ, మర్యాదపూర్వకంగానే డీకేను కలిశానని, కాంగ్రెస్ అధిష్టానం మేరకు నడుచుకుంటామని తెలిపారు. మంత్రి పదవిని ఇస్తే తీసుకుంటా.. ప్రజలకు సేవ చేసేందుకే ఎమ్మెల్యేగా పోటీ చేశా.. కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని శ్రీధర్‌బాబు తెలిపారు. అధిష్టానమే మంత్రి పదవుల్ని నిర్ణయిస్తుందని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అంటున్నారు. నిన్న సీఎం ప్రకటన తర్వాత సీనియర్లందరికీ న్యాయం జరుగుతుందని ఏఐసీసీ కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చెప్పారు. కాంగ్రెస్ నాయకులంతా కలిసి పని చేయాలని ఖర్గే పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే.

# రేవంత్‌కు శుభాకాంక్షలు తెలిపిన కోమటిరెడ్డి

## భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి కూడా..



హైదరాబాద్: రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణలో ప్రజాస్వామిక, ప్రజానుకూల ప్రభుత్వ పాలన రాబోతోందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న సోదరుడు రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామిక విధానాలే అమలవుతాయని తెలిపారు. ఉమ్మడి కార్యాచరణ, ఉమ్మడి నిర్ణయాలే పార్టీకి బలమని, ఇవే సిద్ధాంతాలతో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని ఎన్నుకుని, అధిష్ఠానానికి తీర్మానం పంపారని ఆయన తెలిపారు. మరోవైపు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తన 'ఎక్స్' ఖాతా వేదికగా.. కాబోయే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

# నూతన ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించండి: గవర్నర్‌ను కలిసిన కాంగ్రెస్ బృందం



హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ నేతల బృందం గవర్నర్ తమిళిసైను కలిసింది.

నేతలు మహేశ్‌కుమార్ గౌడ్, మల్లు రవి తదితరులతో కూడి బృందం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో సమావేశమైంది. సీఎల్పీ నేతగా రేవంత్‌రెడ్డి ని ఎన్నుకున్నట్లు ఉన్న లేఖను అందజేశారు. దీంతో పాటు 64 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల సంతకాలతో కూడిన లేఖను ఇచ్చారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా గవర్నర్‌ను నేతలు కోరారు.

# రేవంత్ సీఎం అని ముందే ఎలా చెప్పారు?.. తనదైన శైలిలో ఆన్సర్ చెప్పిన బండ్ల గణేశ్



హైదరాబాద్: రేవంత్‌రెడ్డి సీఎం అవుతారని తాను నెలరోజుల క్రితమే చెప్పానని.. అదే నిజమైందని సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్ అన్నారు. రేవంత్‌రెడ్డి సీఎం అవుతారని ముందే ఎలా అంచనా వేశారని ప్రశ్నించగా ఆయన తనదైన శైలిలో స్పందించారు. ఎల్బీ స్టేడియంలో బండ్ల గణేశ్ మాట్లాడారు. "పోరాడేవారికే కత్తి ఇస్తారు.. కత్తి ఇచ్చేవారికే కిరీటం కూడా ఇస్తారు. దీనిలో పెద్ద లాజిక్కేం లేదు. రేవంత్ రెడ్డి పడిన కష్టం.. మాటతీరు.. జనంలోకి చొచ్చుకెళ్లిన విధానం చూసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని అనుకున్నాం.. వచ్చింది. కాంగ్రెస్ పాలన బ్రహ్మాండంగా ఉంటుంది. ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం.

రేవంత్ నాయకత్వంలో పార్టీ బ్రహ్మాండంగా పనిచేస్తుంది" అని బండ్ల గణేశ్ అన్నారు. ఇకపై కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించే అవకాశముందా? అని ప్రశ్నించగా.. తానెప్పుడూ కాంగ్రెస్ పార్టీ సభ్యుడినేనని బండ్ల గణేశ్ చెప్పారు. ఇప్పటి వరకు ప్రతిపక్షంలో ఉన్నందున ఎంతవరకు ఉండాలో అంతవరకే ఉన్నట్లు తెలిపారు. "2004 నుంచి కాంగ్రెస్‌లోనే ఉన్నాను. నేను కాంగ్రెస్ వాదిని.. అది ప్రపంచానికి తెలిసిన నిజం. మా పార్టీ అధికారంలోకి రావడం సంతోషంగా ఉంది" అని ఆయన చెప్పారు.

# కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు: భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్



హైదరాబాద్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన వ్యక్తి ప్రధాని నరేంద్రమోదీ అని భాజపా ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన చిత్రపటం వద్ద భాజపా నేతలు నివాళులర్పించారు. అనంతరం రాజాసింగ్ మీడియాతో మాట్లాడారు. "అంబేడ్కర్‌ను అన్ని వర్గాల వారు స్మరించుకుంటున్నారు. రాష్ట్రంలో రావణ రాజ్యం అంతమైంది. దళితులను కేసీఆర్ మోసం చేశారు. భాజపా ఒత్తిడితోనే అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఏర్పాటు చేశారు. కేసీఆర్ పథకాలను అమలు చేస్తానని రేవంత్ చెప్పారు. దళితులను మోసం చేస్తే భాజపా కార్యకర్తలు వదిలిపెట్టరు. కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌ను ఎప్పుడూ గౌరవించలేదు. ఆరు గ్యారంటీల పేరుతో మోసపూరిత హామీలను కాంగ్రెస్ ఇచ్చింది" అని రాజాసింగ్ అన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com